తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శనివారం
01 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :

# సింగరేణి ఆర్‌జీ-1లో వరద ప్రాంతాలను సందర్శించిన జీఎం..ఏఐటీయూసీ నాయకులు..

**- 2ఏ ఇంక్లయిన్ అండర్ బ్రిడ్జి కాలువ ఆధునీకరణ చేస్తాం.. - జీఎం లలిత్‌కుమార్..**



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి రామగుండం వన్ ఏరియాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక ఉదయ్‌నగర్, 2ఏ ఇంక్లయిన్ రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాలను శుక్రవారం ఆర్జీ.వన్ జీఎం లలిత్‌కుమార్, డీజీఎం(సివిల్) వరప్రసాద్, గుర్తింపు సంఘం (ఏఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సందర్శించారని ఎఐటియుసి ఆర్జీ.వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. 2ఎ ఇంక్లయిన్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువలో వరద ప్రవాహాన్ని, క్వార్టర్లలో మురికి నీరు, వరద నీరు బయటకు వెళ్ళక నివాసాల్లో ఉండడం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర అవస్థలు పడుతున్నాయని ఏఐటియుసి చేసిన విజ్ఞప్తి మేరకు జిఎంతో సహా అధికారులు పరిశీలించారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిఎం లలిత్‌కుమార్ మాట్లాడుతూ 2ఏ ఇంక్లయిన్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువను ఆధునీకరణ పనులు చేపడతామని, కంపెనీ క్వార్టర్లలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలిపారు. ఆర్జీ.వన్ పరిధిలోని క్వార్టర్ల డ్రైనేజీ వ్యవస్థ గత 30 సంవత్సరాల క్రితం నిర్మించబడిందని, పంది కొక్కులు తోడడంతో పైపులు పూర్తిగా పగిలి మురికి బయటకు వస్తుందని, దీనివల్ల దుర్వాసనతో కార్మిక కుటుంబాలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. తక్షణమే సింగరేణి యాజమాన్యం 2ఏ ఇంక్లయిన్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన కాలువ నిర్మాణంతో పాటు సెక్టార్-1, సెక్టార్-2 క్వార్టర్లలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి, కార్మిక కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని రంగు శ్రీనివాస్ సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. ఏఐటియుసి నాయకులు పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, అధికారులు తదితరులున్నారు.

# రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**○అదనపు రెవెన్యూ కలెక్టర్ బి.శ్రీరాములు.. ○ భూ రీ-సర్వేను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి..**
**○కుటుంబ రిజిస్టర్ ధ్రువపత్రాల జారీకి ప్రాధాన్యత ఇవ్వాలి.. ○ యెల్లంపల్లి ప్రాజెక్టు వద్ద వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి..**
**○ అంతర్గాం తహసీల్దార్ కార్యాలయం, శ్రీపాద ప్రాజెక్టును సందర్శించిన..**





గోదావరిఖని, జనంసాక్షి :
జిల్లాలో ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ బి.శ్రీరాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అంతర్గాం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ వ్యవహారాలపై సమీక్ష నిర్వహించిన అనంతరం,శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించి ప్రస్తుత వరద పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న భూ రీ-సర్వే కార్యక్రమాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మీసేవా ద్వారా అందిన దరఖాస్తులను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. కుటుంబ రిజిస్టర్ ధ్రువపత్రాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే జారీ చేయాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కొంతమంది ఓటు హక్కు పొందేందుకు కుటుంబ రిజిస్టర్ ధ్రువపత్రం కీలకమైనదని, అందువల్ల వాటి జారీని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే ధ్రువపత్రాలు జారీ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన అదనపు కలెక్టర్ ప్రాజెక్టులో నీటి మట్టం, నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాల దృష్ట్యా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో నివసించే ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని, నది పరివాహక ప్రాంతాల్లో ఎవరూ చేపల వేటకు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ యెల్లంపల్లి ప్రాజెక్టు నిర్వహణలో పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. జూలై 31 మధ్యాహ్నం 3 గంటల నాటికి శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం 147.46 మీటర్లు ఉండగా, పూర్తి నీటి మట్టం 148.00 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 18.6750 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, పూర్తి సామర్థ్యం 20.1754 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టులోకి 88,705 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా,96,428 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. ఇందులో 80,370 క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా విడుదల చేస్తుండగా,మొత్తం 62 గేట్లలో 15గేట్లు తెరిచి ఉంచినట్లు అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ పర్యటనలో అంతర్గాం తహసీల్దార్, శ్రీపాద యెల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆర్‌జీ-1 పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి బాధ్యతల స్వీకరణ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి రామగుండం ఏరియా-1లో పర్సనల్ మేనేజర్‌గా రెడ్డిమల్ల తిరుపతి శుక్రవారం అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా రామగుండం ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్ నూతన పర్సనల్ మేనేజర్‌ను అభినందించి, ఉద్యోగులు,కార్మికులు, యాజమాన్యం మధ్య సమన్వయన్ని మరింత బలోపేతం చేస్తూ సంస్థ అభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. తమ పరిపాలనా అనుభవం, సమర్థ నాయకత్వంతో పర్సనల్ విభాగాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అదే సందర్భంగా, పదవీ విరమణ పొందుతున్న పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ బద్ధంగా, సాదరంగా రెడ్డిమల్ల తిరుపతిని పర్సనల్ మేనేజర్ కుర్చీలో ఆసీనులను చేసి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా పర్సనల్ అధికారులు వేణు, శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, పీవో దేవా చారి, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో నూతన పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో అడ్మిషన్ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ..

**- అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ జి.సుబ్బారావు..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ గోదావరిఖని అధ్యయన కేంద్రంలో 2026-27 విద్యా సంవత్సరానికి బీఏ., బీకాం., బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్ ప్రవేశాల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని లర్నర్ సపోర్టు డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డీన్ స్టూడెంట్ ఆపైర్ ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, రూరల్ ఇనిస్టిట్యూషన్ చైర్మన్ డాక్టర్ ఎన్.కిషన్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జైకిషన్ ఓజా, అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.సుబ్బారావు నిర్వహించారు. ఇంటర్మీడియెట్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, డిప్లొమో 10+2 పాస్ అయిన వారు నేరుగా నెట్ సెంటర్, మీ-సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించాలని, చివరి తేదీ 07-08-2026 వరకు ఉందని, సెల్ నం. 7382929655, 9849740479లో సంప్రదించాలని కో-ఆర్డినేటర్ జి.సుబ్బారావు సూచించారు.




## జాగిర్యాల్ గ్రామంలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమ నిర్వహణ



**భీంగల్ రూరల్,జులై 31 (జనం సాక్షి) :** భీంగల్ మండలం జాగిర్యాల గ్రామంలో, గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ ఆధ్వర్యంలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించడం జరిగిగింది. కార్యక్రమంలో భాగంగా భారీ వర్షాల వల్ల రోడ్లపై నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేసి బురద ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ, దోమలు, వ్యాధిగ్రస్త క్రిములు నిలువ ఉండకుండా నివారణ చర్యలు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడల ప్రసాద్ మాట్లాడుతూ, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం నిర్వహించే ఆరోగ్య అవగాహన కార్యక్రమమే 'ఫ్రైడే – డ్రైడే' అని వివరిస్తూ,"దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, ఆశ వర్కర్స్, అంగన్వాడి టీచర్స్, పంచాయతీ సెక్రటరీ,కారోబార్, పారిష్యుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

## కంకర రాళ్లకు బంగారం పూత పూసి మోసం



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 31:( జనం సాక్షి)** నిజామాబాద్ నగరంలోని హమాల్వాడీకి చెందిన రమేష్ వద్ద రూ.1.30 లక్షల అప్పు తీసుకున్న శ్రీనివాస్,అప్పు తీర్చాలని శ్రీనివాస్ పై ఒత్తిడి తెచ్చిన రమేష్, శ్రీనివాస్ తనకు గుప్తనిధులు దొరికాయని, అందులో బంగారం రాళ్లుఉన్నాయని చెప్పి బంగారు రాళ్లను అప్పు కింద పట్టుకోమని రమేష్ ను నమ్మించి,నిజామాబాద్‌లో కాకుండా డిచ్‌పల్లి మండలం ఘన్ పూర్ కి అదనంగా రూ.32 వేలు తీసుకొని రావాలని రమేష్ కు సూచించినట్లూ తెలిసింది.నాలుగు కుండల్లో నాలుగు బంగారం రాళ్లను రమేష్ కు శ్రీనివాస్ అందించినట్లు తెలిపారు.అనుమానం వచ్చి చూడగా.. కంకర రాళ్లకు బంగారం రంగు పూత పూసినట్లు గుర్తించిన బాధితుడు రమేష్, తాను మోసపోయానని గ్రహించి డిచ్ పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రమేష్ తెలిపారు.

## కామ్రేడ్ పూనెం లింగన్న ఆశయ సాధనే నిజమైన నివాళి



**సిరికొండ, జూలై 31 (జనం సాక్షి):** విప్లవ ఉద్యమ నాయకుడు, అజ్ఞాత యోధుడు కామ్రేడ్ పూనెం లింగన్న స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బలమైన విప్లవ ఉద్య మాలను నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్. రమేష్ పిలుపు నిచ్చారు.శుక్రవారం సిరికొండ మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు, బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడైన కామ్రేడ్ పూనెం లింగన్న 7వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆర్. రమేష్ మాట్లాడుతూ, భూమి, భుక్తి, విముక్తి కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు కామ్రేడ్ లింగన్న అని కొనియాడారు. ఆదివాసులు, గిరిజనుల హక్కుల సాధన, పోడు భూముల సమస్య పరిష్కారం, పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయనను ఎప్పటికీ గుర్తుంచు /కుంటామని పేర్కొన్నారు.కామ్రేడ్ లింగన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేయడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. నేటి యువత విప్లవోద్యమ చరిత్రను తెలుసుకొని సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాట స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్. దామోదర్, బి. కిషోర్, మండల నాయకులు ఇ. రమేష్, ఎస్. కిషోర్, ఎం. పండరి, పి. ఎల్లయ్య, ఎం.డి. రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు తొలగింపు



**సదాశివనగర్, జూలై31 (జనంసాక్షి):** సదాశివనగర్ మండలంలోని ఉత్తునూర్--యాచారం రహదారిపై భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విరిగిపడి రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును గ్రామపంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు.చెట్టు రోడ్డుపై పడటంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ఉత్తునూర్ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, గ్రామపంచాయతీ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని చెట్టును తొలగించారు. దీంతో రాకపోకలు తిరిగి యథావిధిగా కొనసాగాయి.స్థానికులు గ్రామపంచాయతీ సిబ్బంది తక్షణ స్పందనను అభినందిస్తూ, వర్షాకాలంలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను ముందస్తుగా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## జనం సాక్షి ఎఫెక్ట్

- దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతులు చేపిస్తున్నఅధికారులు.
- జనంసాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా అధికారులు





**కామారెడ్డి ప్రతినిధి జూలై31 (జనంసాక్షి)** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు టెక్రియాల్ ప్రాంతంలో దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీలను గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతినడంతో పాటు కొన్ని చోట్ల ఇళ్లు కూలిపోవడం, అధికారులకు తక్షణమే రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, దెబ్బతిన్న డ్రైనేజీలను మున్సిపల్ అధికారులు తక్షణమే పనులు ప్రారంభించారు.

## వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం





- **క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 31( జనం సాక్షి) :**భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వర్షాల ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై గత కొన్ని రోజులుగా నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రి ఆవరణలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.భారీ వర్షాలతో పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో చెరువు వద్ద సంప్రదాయ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చెరువు పరిసరాలను పరిశీలించి, ప్రస్తుత పరిస్థితుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లవద్దని జాలర్లను హెచ్చరించారు. ప్రజలు ప్రమాదవశాత్తు చెరువు వైపు వెళ్లకుండా తగిన బారికేడ్లు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు.జీఆర్ కాలనీలో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ: "ప్రజల ప్రాణ భద్రతే జిల్లా యంత్రాంగం తొలి ప్రాధాన్యం. భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలి. నీటి నిల్వలు, చెరువులు, కాలువలు వంటి ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి. ప్రజలు కూడా నిర్లక్ష్యం చేయకుండా అధికారుల సూచనలను పాటించి అప్రమత్తంగా ఉండాలి. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి. పర్వతాలు, తహసీల్దార్ హిమబిందు, స్థానిక కౌన్సిలర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ఎన్. హన్మంతరావు నాయక్, టౌన్ ప్లానింగ్ అధికారి ఎ. వినీత్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సి. హెచ్. వేణుప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ సహజం

- **ఆర్టీసీ నిజామాబాద్-1 డిపో మేనేజర్ బి. ఆనంద్‌కి ఘన వీడ్కోలు**





**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 31: జనం సాక్షి** టీ.జీ.ఎస్.ఆర్టీసీ నిజామాబాద్-1 డిపో డిపో మేనేజర్ బి.ఆనంద్ పదవీ విరమణ సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ ఎస్.వి.జి. కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై, బి. ఆనంద్ సేవలను కొనియాడారు. ఆయన సంస్థ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో విశేష కృషి చేశారని ప్రశంసించారు.కార్యక్రమంలో పి.ఓ. పద్మజ, ఎ.ఓ స్వరూప రాణి ల,5 డిపోల డిపో మేనేజర్లు, రీజినల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొని బి. ఆనంద్ ని శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు.అనంతరం సహటరీద్యోగులు, ఉద్యోగులు పుష్పవర్షం కురిపిస్తూ, ఘన వీడ్కోలు పలికి, ఆయనకు ఆనందకరమైన పదవీ విరమణ జీవితం కలగాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయ అధికారులు, డిపో మేనేజర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బి. ఆనంద్ కి భావోద్వేగపూర్వక వీడ్కోలు పలికారు.

## మిడ్‌మానేరు జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం



**● నీటిమట్టం 309.39 మీటర్లకు చేరిక.. 10.465 టీఎంసీల నిల్వ**

**బోయిన్ పల్లి జులై 31 (జనం సాక్షి)**రాజన్న సిరిసిల్ల జిల్లా మిడ్‌మానేరు జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొన సాగుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల నాటికి జలా శయంలో నీటి మట్టం 309.39 మీటర్లకు చేరగా, పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లు. ప్రస్తుతం జలా శయంలో 10.465 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, పూర్తి సామర్థ్యం 27.55 టీఎం సీలుగా ఉంది. జలా శయానికి మొత్తం 17,427 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఇందులో శ్రీ రాంసాగర్ యెల్లంపల్లి ప్రాజెక్టు (ఎస్‌వైపీ) నుంచి 15,750 క్యూసెక్కులు, మానేరు, మూలవాగు, ఎఫ్ఎఫ్‌సీ ఇన్‌లెట్ల ద్వారా 1,677 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఎస్ఆర్ఎస్‌పీ నుంచి ఎలాంటి ప్రవాహం లేదు. అవుట్‌ఫ్లో 112 క్యూసెక్కులుగా నమోదైంది. ఇందులో ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎంబీ ద్వారా 45 క్యూసెక్కులు విడుదల వుతున్నాయి. జలా శయం స్పిల్‌వే గేట్లు, రేడియల్ స్లూయిస్ గేట్లు తెరవలేదు. అలాగే కాలువల ద్వారా కూడా నీటి విడుదల చేపట్ట లేదనీ. జలాశయ పరిస్థితిని నిరంతరం పర్య వేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.

## దర్శ పారశాల వంతెన కోసం కొలతలు తీసిన పాలక వర్గం



**మల్లాపూర్ జులై 31(జనంసాక్షి)** మల్లాపూర్ మండల కేంద్రంలో గత రెండు రోజులుగా అతి భారీ వర్షాలతో అతలాకుతలమైన ఆదర్శ పారశాల రోడ్డు నష్టం పై వివరాలు నమోదు, కొత్తగా నిర్మించబోయే వంతెన కోసం గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో కొలతలు తీసారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ అతి త్వరలో సీసీ రోడ్డు, వంతెన నిర్మాణం పనులు మొదల వ్వాలని మూడు సార్లు ప్రతి పాదనలు పంపా మని తెలిపారు. గ్రామపంచాయతీ వార్డు సభ్యులు ముష్కరి రమేష్, భుఖ్య శేఖర్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండ అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించిన డీఎఫ్‌వో



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 31: జనం సాక్షి** నిజామాబాద్ జిల్లా నూతన అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) ప్రశాంత్ పాటిల్ శుక్రవారం సిరికొండ మండల అటవీశాఖ కార్యాలయాన్ని సందర్శించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆర్మూర్, వర్ని, కమ్మర్‌పల్లి ప్రాంతాలను సందర్శించినట్లు తెలిపారు. సిరికొండ పరిధిలోని అటవీ పరిస్థితులను తెలుసుకునేందుకే ఈ పర్యటన చేపట్టినట్లు చెప్పారు. అటవీ భూముల ఆక్రమణలపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, తాను కొత్తగా బాధ్యతలు చేపట్టానని, ఎలాంటి అక్రమాలు ఉన్నా పూర్తి స్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కబ్జాకు గురైన భూములకు ఎఫ్ ఆర్ ఓ తన సిబ్బందితో కలిసి ట్రంచ్ ఏర్పాటు చేస్తున్నారు కొత్తగా ఎవరైనా అటవీ భూములను చదును చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటవీశాఖ అధికారులు ఎవరైనా భూ కబ్జాదారులకు కొమ్ము కాస్తే వారి పైన కూడా శాఖపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సిరికొండ చుట్టూ గుట్టలు అడవి ఉంది ఈరోజు ఉంది రేపు ఉంటదో ఉండదు ఇక్కడ ఉన్న మాత విశాఖ అధికారులు చాలా బాగా పనిచేస్తున్నారు . కబ్జాకు గురైన భూములను ట్రెంచ్ కొట్టి తీస్తున్నారు వాటిలో ప్లాంటేషన్ చేస్తాం ప్రభుత్వ భూమి ప్రజలందరూ కాపాడుకోవాలి ఒక అటవీశాఖ కాదు ప్రజలందరి బాధ్యత. సిరికొండ మండల కేంద్రంలో రేంజ్ ఆఫీసు బాగుండాలి నిర్మించేందుకు పై అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని అన్నారు. తూంపల్లి సెక్షన్లో పోడు భూమితున్నారని తెలిసి అటవీ శాఖ అధికారి కేజ్వీల్ ట్రాక్టర్ను బీటీ రోడ్డుపై తీసుకు రావడం పై విచారణ జరిపి అధికారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఖీణూ చంద్రశేఖర రావు. నర్సింగరావు. బీట్ ఆఫీసర్లు సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు

## విద్యార్థుల భద్రతే లక్ష్యం

**● జాతీయ రహదారిపై విజిబుల్ పోలీసింగ్**



**సదాశివనగర్, జూలై31 (జనంసాక్షి):** జాతీయ రహదారి--44పై ఉన్న సదాశివనగర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థుల భద్రత కోసం సదాశివనగర్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రతిరోజూ పారశాలకు వచ్చే సమయంలో, తిరిగి ఇళ్లకు వెళ్లే సమయంలో విద్యార్థులు జాతీయ రహదారిని దాటాల్సి వస్తుండటంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. నేషనల్ హైవే పెట్రోలింగ్ ఎస్ఐ మన్సూర్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు ప్రమోద్ రెడ్డి, స్వామిరెడ్డి తదితర హైవే పెట్రోలింగ్ సిబ్బంది విద్యార్థులను సురక్షితంగా రహదారి దాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన పోలీసులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి, జాగ్రత్తగా రోడ్డు దాటే అలవాటు నేర్పించాలని కోరారు. పారశాలలు, కళాశాలల సమీపంలో వాహనదారులు వేగాన్ని తగ్గించి అప్రమత్తంగా ప్రయాణిస్తూ విద్యార్థుల భద్రతకు సహకరించాలని సదాశివనగర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ చర్యలతో విద్యార్థులు, తల్లిదండ్రులు పోలీసుల సేవలను అభినందిస్తున్నారు.

## నాగారం చెరువు చెక్ డ్యామ్ కు జలకళ



**రుద్రంగి, జూలై 31 (జనం సాక్షి)**రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని నాగారం చెరువు దగ్గర నిర్మించిన చెక్ డ్యామ్ ద్వారా బతుకమ్మ కుంటకు నీరు చేరింది. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక రైతులు తీవ్ర ఆందోళన చెందారని, గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో రైతులకు ఊరట లభించిందని నాయకులు అన్నారు. నాగారం చెరువు మాటు దగ్గర నిర్మించిన చెక్ డ్యామ్ ద్వారా బతుకమ్మ కుంట చెరువులోకి నీరు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంజూరు చేసిన రూ.12 లక్షల 50 వేల నిధులతో ఈ చెక్ డ్యామ్ ను నిర్మించామని, అలాగే ఉపాధి హామీ కూలీలతో కాలువను శుభ్రపరచడం వల్లనే నీరు సాఫీగా వచ్చిందని తెలిపారు. రైతులపై ఉన్న మక్కువతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యవసాయ రంగానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నారని కొనియాడారు. రైతుల పక్షాన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం స్థానిక సర్పంచ్ గండి నారాయణ, మార్కెట్ చైర్మన్ చెలుకల తిరుపతి, మండల అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య స్థానిక నాయకులతో కలిసి చెక్ డ్యామ్ ను, బతుకమ్మ కుంటలోకి వస్తున్న నీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, వార్డు మెంబర్లు పుదరి మహిపాల్, ఎర్రం అరవింద్, సతీష్, నాయకులు గడ్డం శ్రీనివాస్, కొమిరె శంకర్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీలో సాధారణ సర్వ సభ్య సమావేశం




**● మొత్తం 38 అంశాలకు గాను కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం**

**● చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి**

**జమ్మికుంట,జులై 31(జనం సాక్షి):**జమ్మికుంట మున్సిపాలిటీలో శుక్రవారం చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్),కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 38 అంశాలు చదివి వినిపించగా వీటిలో కార్యాలయంలో వెహికల్ రిపేరు,శ్రీరామ హాస్పిటల్ నుండి హోటల్ నరసయ్య ఇంటి వరకు డ్రైనేజీ,కల్వర్టు నిర్మాణం,రానున్న వర్షాకాలం దృష్ట్యా నీటి నిలువ ఉన్న చోట ఆర్ సి సి పైపులు కొనుగోలు చేయడం, లీకేజీ వాటర్ ను అరికట్టుట, వాళ్ళ రిపేరు,బ్లేడ్ ట్రాక్టర్, జెసిబి ,లాడర్ రిపేరు చేయుటకు,రానున్న వినాయక చవితి వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయుటకు క్రేన్లు కిరాయి తీసుకోవడం, జనరేటర్ టైంటూ స్టేజ్, రోడ్లపై గుంతలు పూడ్చడం,మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఇంటర్ ఫోన్ కనెక్షన్స్, టీవీ ఏర్పాటు చేయుటకు,గాంధీ చౌక్ జాతీయ జెండా పోల్ మరమ్మత్తులు చేసి జెండా ఆవిష్కరణ చేయడానికి గాను లక్ష రూపాయలు కౌన్సిల్ ఆమోదం,వీధి దీపాల కొరకు పిసిబిఎస్ సెన్సార్లు, డైవర్స్, ఎల్ఈడి లైట్లు,వీధి దీపాల సామాను కొనుగోలు కొరకు 10 లక్షలు,డెవలప్మెంట్,మొక్కలు కొనుగోలు చేయడం కొరకు,డ్రైనేజీ నిర్మాణం మొత్తం 38 అంశాలను కౌన్సిల్ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జావిద్, మున్సిపల్ కౌన్సిలర్ లు, మేనేజర్ జి.రాజిరెడ్డి ,ఏఈ వికాస్ ,జే ఏ ఓ రాజశేఖర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 31: (జనం సాక్షి)** ఇందూరు: నగరంలోని వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ని గురువారం రాత్రి ఢిల్లీలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు - నాందేవాడ (ఆర్ వోబీ) అదనపు వంతెన మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ రైల్వే లైను దాటడానికి విజయ థియేటర్, అలాగే నాందేవాడ వద్ద రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయన్నారు. రద్దీ ఎక్కువగా కావడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదని, కావున నూతన ఆర్ వోబీ మంజూరు చేయాలన్నారు. అలాగే ఎల్లమ్మగుట్ట వద్ద సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో మరొక ఆర్ యూబీ అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు.

## జిల్లా స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థినుల సత్తా



**సదాశివనగర్ జూలై31 (జనంసాక్షి):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) విద్యార్థినులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. మై భారత్ పోర్టల్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కామారెడ్డి జిల్లా స్థాయి పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చి పలు బహుమతులు కైవసం చేసుకున్నారు. డ్యాన్స్ విభాగంలో శ్రావ్య అండ్ గ్రూప్ ప్రథమ బహుమతి సాధించగా, నినాద రచనలో కె. మానస ద్వితీయ బహుమతి, భార్గవి తృతీయ బహుమతి అందుకున్నారు. కవితా రచనలో ప్రశర్ష ద్వితీయ బహుమతి, వక్తృత్వ పోటీలో రాజ భవాని ద్వితీయ బహుమతి, గాన పోటీలో కె. సుప్రియ తృతీయ బహుమతి సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. శోభారాణి విజేతలను అభినందిస్తూ, ఇలాంటి పోటీల్లో మరింత ఉత్సాహంగా పాల్గొని కళాశాలకు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్ ఎస్. కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చంద్రకళ, సభ్యులు మౌనిక, యువరాణి, కృష్ణవేణితో పాటు కళాశాల అధ్యాపకులు విజేతలను అభినందిస్తూ వారి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

## ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి



కోరుట్ల జూలై 31 (జనం సాక్షి)ప్రాథమిక పాఠశాల అల్లమయ్యగుట్టలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందుతున్న సోమ గంగాధర్ సన్మాన సభ ఘనంగా నిర్వహించి, టీజీయూఎస్ (తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం) జగిత్యాల జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సోమ గంగాధర్ దాదాపు 24 సంవత్సరాల పాటు నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావంతో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తికి ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా గంగాధర్ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం, ప్రశాంతతలతో కుటుంబ సభ్యుల మధ్య సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షుతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించడం సాధ్యం కాదని చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యా వాలంటీర్లను వెంటనే నియమించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను దసరా సెలవుల్లోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, సభాధ్యక్షులు మరియు ప్రధానోపాధ్యాయులు జ్యోతి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్ రావు, జోస్నా, మాజీ మండల విద్యాధికారి సుధాకర్, ఉపాధ్యాయులు మహేష్, భవాని, శేఖర్, రాధ, సీఆర్పీ గంగాధర్, విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ, ఆయాల పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన



**బోధన్, జూలై 31 ( జనంసాక్షి ) :** అంగన్వాడి టీచర్, ఆయా పోస్ట్ ల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువ పత్రాలతో హాజరు కావాలని బోధన్ సీడీపీఓ నందిని శుక్ర వారం కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ టీచర్ మరియు అంగన్వాడి ఆయా పోస్ట్ కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ దువపత్రాలను ఈనెల 27వ తేదీ నుంచి ఆగస్టు 5 వరకు పరిశీ లించడం జరుగు తుందన్నారు. ఒరి జినల్ ధ్రువ పత్రాలు వెరిఫికేషన్ శుక్ర వారం జరిగి నప్పటికీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు చాలామంది రానందున ఆగస్టు 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కి రావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొని ఐసిడిఎస్ బోధన్ కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. లేనియెడల అట్టి దరఖాస్తులను పరిగణలోకి తీసుకొనబడవని సీడీపీఓ నందిని స్పష్టం చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం



సదాశివనగర్, జూలై31 (జనంసాక్షి): డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు చేపట్టిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో గౌరవ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ చందర్ నాయక్ పాల్గొన్నారు. సదాశివనగర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఆసుపత్రి పరిసరాల్లో పెరిగిన పొదలను తొలగించే కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రత చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ వ్యాధుల నివారణకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీ ఓ సురేందర్, ఏపీవో శ్రీనివాస్, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లో లెవల్ వంతెనపై ఉధృత ప్రవాహం నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



సిరికొండ, జూలై 30 (జనం సాక్షి): కొండూరు వంతెన దెబ్బతినడంతో సిరికొండ మండలానికి ప్రధాన రాకపోకలు ఇప్పటికే దెబ్బతిన్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గంగా చిన్నవాల్గొట్ గ్రామంలోని లో లెవల్ వంతెన మీదుగా ఆర్టీసీ బస్సులను తాత్కాలికంగా నడుపుతున్నారు. అయితే గురువారం కురిసిన భారీ వర్షాలకు చిన్నవాల్గొట్ లో లెవల్ వంతెనపై ఒక్కసారిగా వరద ప్రవాహం ఉధృతంగా పెరగడంతో వంతెన పూర్తిగా నీట మునిగింది. పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బస్సులను వంతెన దాటించకుండా చిన్నవాల్గొట్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దే నిలిపివేశారు. దీంతో చిన్నవాల్గొట్--భీంగల్, నిజామాబాద్, రావుట్ల, సిరికొండ మార్గాల్లో నడిచే ఆర్టీసీ బస్సులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, అత్యవసర పనులపై బయలుదేరిన వారు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి 9 గంటల సమయంలో బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. అప్పటికే చీకటి పడటంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులతో ప్రయాణిస్తున్న కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురయ్యాయి. "ఇప్పుడు ఇళ్లకు ఎలా చేరుకోవాలి?" అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలు లేకపోవడంతో కొందరు గంటలపాటు బస్సుల్లోనే నిరీక్షించగా, మరికొందరు వర్షంలోనే తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొండూరు వంతెన దెబ్బతిన్న తర్వాత చిన్నవాల్గొట్ మార్గమే మండల ప్రజలకు ప్రధాన ప్రత్యామ్నాయంగా మారింది. కానీ ప్రతి భారీ వర్షానికి లో లెవల్ వంతెనలపై వరద నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య అత్యవసర సేవలు, ఉద్యోగులు, విద్యార్థులు, గ్రామీణ ప్రజల ప్రయాణాలు తరచూ అంతరాయం కలుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి చిన్నవాల్గొట్ రహదారిపై ఉన్న లో లెవల్ వంతెనలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి స్థానంలో ఎత్తైన శాశ్వత వంతెనలను నిర్మించాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తాత్కాలిక ఏర్పాట్లతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపితేనే ప్రతి వర్షాకాలంలో ఎదురవుతున్న ఈ కష్టాలకు ముగింపు పడుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## రుద్రంగిలో సర్వసభ్య సమావేశం



రుద్రంగి, జూలై 31( జనం సాక్షి)రుద్రంగి మండల రైతు వేదికలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో నటరాజ్, తహసీల్దార్ పుష్పలత అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఏఎంసీ చైర్మన్ చేలూకల తిరుపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సర్పంచుల ద్వారా తెలుసుకుని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులం దరికీ అందేలా చూడాలని కోరారు. అనం తరం మండలంలోని తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, వ్యవసాయ సమస్యలపై సర్పంచులు, అధికారులతో చర్చిం చారు. ఈ సమావేశంలో మండల ంలోని వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు గిరిప్రదక్షిణ ఫలితమే సమృద్ధి వర్షాలు

**వర్షాలతో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి - కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సత్యం..**

**శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ వల్లే నేడు తెలంగాణకు నీళ్లు - కాళేశ్వరం అట్టర్ ఫ్లాప్. మేడిపల్లి సత్యం..**



**కరీంనగర్ బ్యూరో, జూలై 31 (జనంసాక్షి) :** జిల్లా వ్యాప్తంగా 3 రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎరువుల పంపిణీ, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జిల్లా యంత్రాంగంలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. అనంతరం మీడియాను ఉద్దేశించి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులందరూ సంతోషంగా ఉన్నారని, ఎల్ ని నో ప్రభావంతో కరువు వస్తుందని ఆందోళన పడ్డ రైతులు ఇప్పుడు సంతోషంగా దుక్కి దున్నుకుంటూ నాట్లు వేస్తున్నారని, ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి కరువుతో కాంగ్రెస్ పార్టీ పని అయిపోతుందని రైతులను రెచ్చగొట్టి, రాజకీయ పబ్బం గడుపుదామని మొన్నటి వరకు బిఆర్ఎస్ నేతలు కలలు కన్నారని, ఆ కలలు అన్నింటినీ వమ్ము చేస్తూ భగవంతుని ఆశీర్వాదంతో వరుణుడు కరుణించి పుష్కలంగా వర్షాలు పడుతున్నాయని, ఈ వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవుడు అనుగ్రహించడం శుభ పరిణామమని తెలిపారు. ఎంతసేపు ఈ రాష్ట్రంలో వర్షాలు పడద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవాలని బిఆర్ఎస్ నేతలు ఏడుపుగొట్టు రాజకీయాలు చేశారని, బిఆర్ఎస్ నేతల చెంప చెల్లుమనిపించేలా సకాలంలో వర్షాలు పడటం రైతులకు ఎంతో ఉపశమనం కలిగించాయి.
ప్రపంచంలోనే గొప్ప ప్రాజెక్టు కట్టామని బిఆర్ఎస్ నేతలు చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిన రెండున్నర సంవత్సరాల నుండి కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం లేకుండానే నీళ్లు ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన శ్రీపాద ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ వరద కాలువ నేడు తెలంగాణ రైతాంగానికి ఉపయోగపడుతున్నాయి. కన్నేపల్లి పంపు ఆన్ చేయకుండానే రెండున్నర సంవత్సరాలుగా నిలుస్తున్నాము ఇంకా ఇస్తాము, గత ప్రభుత్వం కట్టిన ఏ ప్రాజెక్టుతోను ఎలాంటి ప్రయోజనం లేదు.. ఇంత జరుగుతుంటే సిగ్గు లేకుండా మా వల్లే వర్షాలు పడ్డాయని బి ఆర్ ఎస్ నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదంతో జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని గట్టిగా మేము కొండగట్టు మహా గిరి ప్రదక్షిణ చేయడం జరిగింది. దానిని కూడా హేళన చేస్తూ గిరి ప్రదక్షిణ చేస్తే వర్షాలు వస్తాయ అని, నడిస్తే వర్షాలు పడతాయి అంటూ బిఆర్ఎస్ నేతలు దొంగ ధర్నాలు చేశారు. మేము ఖచ్చితంగా చెప్తాం, మేము కొండగట్టు గిరి ప్రదక్షిణ చేయడం వల్లనే వర్షాలు పడ్డాయని తెలిపారు. 2023 తర్వాత ఈ రాష్ట్రంలో బిఆర్ఎస్ ఒక ముగిసిన అధ్యాయం, 2023 సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ పార్టీని ప్రతిపక్షానికి పరిమితం చేశారు. జరిగిన అన్ని ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా దోచుకున్న వేల కోట్లతో బిఆర్ఎస్ నేతలు కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ ను అడ్డుపెట్టుకొని చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్, తదితరులు ఉన్నారు.



## భీంగల్ మున్సిపల్ సిబ్బందికి రెయిన్ కోట్లు పంపిణీ

**మున్సిపల్ చైర్పర్సన్, కమిషనర్ చేతుల మీదుగా అందజేత**

**భీంగల్ టౌన్,జులై 31(జనంసాక్షి)**
భీంగల్ పట్టణ మున్సిపల్ కార్పొరేషన్ లో విదులు నిర్వహించే మున్సిపల్ పారిష్యుద్ధ కార్మికులకు, ఎలక్ట్రికల్ సిబ్బందికి, నీటి సరఫరా సిబ్బందికి వర్షాకాలం దృష్ట్యా వారి రక్షణ కొరకు మున్సిపల్ చైర్పర్సన్ బొదిరే నాగమణి స్వామి, వైస్ చైర్పర్సన్ సంటి లత నర్సయ్య, కమిషనర్ గజానంద్ చేతుల మీదుగా రెయిన్ కోట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బొదిరే నాగమణి స్వామి, వైస్ చైర్పర్సన్ సంటి లత నర్సయ్య, కమిషనర్ గజానంద్, కౌన్సిలర్లు తోట సతీష్, మహమ్మద్ అంజూమ్ అలీ, ముమ్మారి సందీప్, సంగ్య నాయక్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భీంగల్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులకు అఓఆం ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు



**భీంగల్ టౌన్,జులై 31(జనంసాక్షి)**
కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యం లో పట్టణ పరిపాలన, మున్సిపాలిటీ చట్టాలు, ప్రజా పాలన పై అవగాహన, స్వచ్ఛ సర్వేక్షన్, మున్సిపల్ రెవిన్యూ, వన మహోత్సవం వంటి అంశాలపై, అలాగే కౌన్సిలర్ నిర్వహించే బాధ్యతల పైన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి భీంగల్ పట్టణ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో భీంగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, వైస్ చైర్‌పర్సన్ చంటి లత నర్సయ్యతో పాటు, కౌన్సిలర్లు ఆరెపల్లి శ్రీజ నాగేంద్రబాబు, పర్శ కుశలత అనంతరావు, తోట సతీష్, బోదిరే లావణ్య నర్యయ్య, అంజుమ్ అలీ, సందీప్, నీలం రవి, సంగ్యా నాయక్ పాల్గొన్నారు.

## ఆగస్టు 12న కామారెడ్డిలో జరిగే గీతన్న చైతన్య యాత్ర సభను విజయవంతం చేయాలి సైదగౌని వెంకట్ గౌడ్



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి జూలై 31 (జనంసాక్షి):**కల్లుగీత కార్మికుల హక్కుల సాధన, వృత్తి రక్షణ కోసం నిర్వహిస్తున్న గీతన్న చైతన్య బస్సు యాత్రలో భాగంగా ఆగస్టు 12న కామారెడ్డిలో జరిగే భారీ సభను విజయవంతం చేయా లని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సైదగౌని వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కామారెడ్డి పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో కల్లు డిపోలో గీతన్న చైతన్య యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైదగౌని వెంకట్ గౌడ్ మాట్లాడుతూ, కల్లుగీత వృత్తి రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే గీతన్న చైతన్య బస్సు యాత్రను ప్రతి గీత కార్మికుడు విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా గీత కార్మికుల సమస్యలను ప్రజలకు తెలియజేయడమే ఈ చైతన్య యాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ప్రారంభమయ్యే ఈ బస్సు యాత్ర ఆగస్టు 12న ఉదయం 10 గంటలకు మాచారెడ్డికి చేరుకుంటుందని, అక్కడి నుంచి బైక్ ర్యాలీగా కామారెడ్డికి చేరుకుని రేణుకా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే గీతన్న చైతన్య సభలో ముగుస్తుందని వివరించారు. గౌడ సంఘ సభ్యులు, గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ అధ్యక్షులు రాజా గౌడ్, రామచందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, యాదగిరి గౌడ్, శైలేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజు గౌడ్, కార్యదర్శి రాజా గౌడ్, పెంటా గౌడ్, స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన డిపో మేనేజర్‌కు ఘన సన్మానం

**తుంపల్లి గ్రామం కొత్త తిరుపతి గుడి కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వక సత్కారం**

**సిరికొండ జూలై 31 జనం సాక్షి ):**
ఈరోజు వన్ డిపో డిపో మేనేజర్ పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. తుంపెల్లి గ్రామం నుంచి కొత్త తిరుపతి గుడి కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్ గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు డిపోకు వెళ్లి డిపో మేనేజర్‌ను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు డిపో మేనేజర్ సేవలను కొనియాడుతూ, విధి నిర్వహణలో ఆయన చూపిన క్రమశిక్షణ, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి జులై 31 (జనం సాక్షి )**
జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావు తన కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన జ్యేష్ట పుత్రిక జొనిట వివాహ ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రికి అందజేసి, వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంతరావు ఆహ్వానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదరంగా స్వీకరించి, కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది. జొనిట వివాహ విందు కార్యక్రమం బిచ్కుందలోని డిగ్రీ కళాశాల పక్కన, దద్గి రోడ్డులో ఏర్పాటు చేసిన వేదికలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వివాహ వేడుకకు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు సమాచారం.



# వాడీవేడిగా జనరల్ బాడీ మీటింగ్

## - పలు సమస్యలపై ఎంపీడీవోకు సర్పంచుల వినతిపత్రం



**కోనరావుపేట(జనంసాక్షి):** కోనరావుపేట మండల సర్వసభ్య సమావేశంలో గ్రామపంచాయతీల ఆర్థిక సమస్యలు ప్రధాన చర్చగా మారాయి. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు వీధి దీపాలు, బోరు మోటార్ల విద్యుత్ బిల్లులను గ్రామపంచాయతీ నిధుల నుంచి చెల్లించబోమని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు ఎంపీడీవో స్వీకృకు వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామ పంచాయతీలపై జీపీడీపీ (ఉఖఆఖ) నిబంధనలను వర్తింపజేయవద్దని వినతిలో కోరారు. గ్రామ పంచాయతీలకు తగిన నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు, నిర్వహణ భారంగా మారిందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రత్యేక అధికారి జెడ్పి డిప్యూటీ సీఈవో లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా సభలో వివిధ శాఖ అధికారుల సమక్ష నిర్వహించారు. తాసిల్దార్ వరలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలోని భూ సమస్యలపై కొందరు సర్పంచులు భూ సమస్యలు పరిష్కరించడం లేదని రాజన్న గొల్లపల్లి సర్పంచ్ అంగన్వాడీ కేంద్రం నిర్మిస్తామంటే అక్కడ ప్రభుత్వ భూమిని అడ్డుకుంటున్నారని ఆ భూమి ఎవరిది అని నిర్ధారించి చెప్పాలని ఈ విషయమే ఆరు నెలలుగా మీతో నీకు చెప్తే పట్టించుకోవడంలేదని తాసిల్దారును అడిగాడు సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్ మాట్లాడుతూ 311 సర్వేనెంబర్ రైతులు కు పట్టాలు లేక యూరియా రావడంలేదని గతంలో పట్టాలు ఉండి గత నాలుగు సంవత్సరాల నుంచి పట్టాలను తొలగించారని వెంటనే ఆ భూ సమస్య పరిష్కరించాలి రైతులకు యూరియా అందేలా చూడాలని ఆయన అన్నారు.హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కు కొన్ని ఇళ్లకు డబ్బులు రాలేదని త్వరలోనే వస్తాయని అన్నారు అనంతరం ధర్మారం సర్పంచి బాలాజీ మాట్లాడుతూ 107 మండలంలో 107 ఇల్లు మంజూరయ్యాయని కానీ ధర్మారం గ్రామంలో మంజూరు కాలేదని, తాను ప్రతిపక్ష పార్టీలో ఉన్నానని ఇల్లు మంజూరు ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా పలువురి సర్పంచుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం జెడ్పి సీఈవో మాట్లాడుతూ అధికారులు సర్పంచులు సమన్వయంగా ఉండాలని ప్రజా ప్రతి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని మీ సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



# ఇంకుడు గుంతలతో నీటిని పరిరక్షిద్దాం

## చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

**సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలో ని అన్ని వార్డులలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టి నీటిని పరిరక్షించాలని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ కమిషనర్ టి రమేష్ సూచించారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.అన్ని వార్డులలో ప్రజలు ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కౌన్సిలర్లు ఉట్ల వర ప్రదీప్,గాజుల రాజమల్లు, వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్,బాకం సాయికిరణ్,చింతల రాజు,కందునూరి సమత కుమార్,గరిగె శోభారాణి శ్రీనివాస్,కల్వల శంకరమ్మ ఓదెలు తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా కార్యదర్శిగా ధన్‌రాజ్ యాదవ్..



**గోదావరిఖని, జనంసాక్షి :** కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ పెద్దపల్లి జిల్లా కమిటీకి కొత్త బాధ్యులను నియమించారు.జిల్లా సెక్రెటరీగా ధన్‌రాజ్ యాదవ్, జనరల్ సెక్రెటరీగా కొల్లూరి ప్రకాష్‌ను నియమిస్తూ సంస్థ జాతీయ అధ్యక్షుడు నవీన్, పి.శర్మ,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు నియామక ఉత్తర్వులు అందించారు.నూతనంగా నియమితులైన దన్‌రాజ్ యాదవ్, కొల్లూరు ప్రకాష్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జాతీయ,రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ప్రజల్లో అవగాహన కల్పించడం, వినియోగదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి సంస్థ ఆశయాలకు అనుగుణంగా అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ నియామకాల పట్ల సంస్థ నాయకులు, సభ్యులు, పలువురు సామాజిక ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్..

**- గోదావరి తల్లికి వాయినం సమర్పించి ప్రత్యేక పూజలు..**

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నియోజకవర్గంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టును శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సందర్శించారు.కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టులోకి వస్తున్న వరద ప్రవాహం, నీటి నిల్వలు, పరిస్థితులను అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గోదావరి తల్లికి సంప్రదాయబద్ధంగా వాయినం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ప్రకృతి విపత్తులు కలగకుండా కాపాడాలని ప్రార్థించారు. అనంతరం ప్రాజెక్టు పరిస్థితిపై అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే, వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఎమ్మెల్యే వెంట రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



### కులిన ఇంటిని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఎల్లారెడ్డిపేట, జూలై 31, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాగట్లపల్లి గ్రామానికి చెందిన గొర్రె మల్లయ్య ఇల్లు వర్షాలకు కూలిపోగా శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా డయాలసిస్ పేషంట్‌గా ఉన్న మల్లయ్య కోసం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ప్రభుత్వపరంగా సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, రాగట్లపల్లి సర్పంచ్ నెతెట్ల లక్ష్మయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూడిది రాజేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, షేక్ గౌస్, గంట బుచ్చాగౌడ్ పరామర్శించారు.

### పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన గ్రామసర్పంచ్



**ఎల్లారెడ్డిపేట, జూలై 31, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ అందె సుభాష్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, రుచికరమైన కూరగాయలు పెట్టాలని మధ్యాహ్న భోజనం సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జి. రవి, అంగన్వాడీ టీచర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఇల్లు కూలిన బాధితురాలికి అన్ని విధాలుగా ఆదుకుంటాం...

### మండల తహశీల్దార్ సుజాత



**ఎల్లారెడ్డిపేట, జూలై 31, (జనంసాక్షి) :** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో అల్లడి విజయ ఇల్లు కూలిపోగా ఆ విషయం తెలుసుకొని శుక్రవారం తహశీల్దార్ సుజాత పరిశలించారు. బాధిత అల్లడి విజయకు మేము ఉన్నాం అన్ని విధాలుగా ఆదుకుంటాం ఎం రంది పడకండి అని మునలావిడకి తహశీల్దార్ సుజాత భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొండాపురం వెంకటరెడ్డి, కార్యదర్శి సంతోష్, జిపివో అంజమ్మ, ఆర్ఐ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# జలసిరి,పారిశుద్ధ్యంపై అమలుపై ఎంపీడీవో సమావేశం




**సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నీలగిరి దివ్య దర్శన్ రావు అధ్యక్షతన సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులతో జలసిరి,పారిశుద్ధ్యం అమలుపై డి ఎల్ పి ఓ దేవకి దేవి సమావేశం నిర్వహించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, పంటకుంటల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, నీరు నిల్వ లేకుండా చూడడంతో పాటు ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి ఎల్ పి ఓ దేవకిదేవి, మిషన్ భగీరథ సహాయక ఇంజనీర్లు శ్రీకాంత్ సూర్యతేజ, సహాయక ఇంజనీర్ సచిన్ తో పాటు పంచాయతీ అధికారి మౌనిక మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎలిగేడులో 15 వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలి

**- ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు టెండర్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**- ఎలిగేడు మండలంలో ప్రతిపాదిత గోదాం స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**ఎలిగేడు,జూలై 31(జనంసాక్షి) :** శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎలిగేడు మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)ఆధ్వర్యంలో నిర్మించనున్న 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాం నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాం నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఆధునిక నిల్వ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా గోదాం నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పనుల అమలులో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిసిఓ శ్రీ మాల,ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, ఎలిగేడు తహసిల్దార్ యాకన్న,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి అంటూ రైతులను నిండా ముంచుతారా



- ధాన్యం కుంభకోణంపై ఎమ్మెల్యేకు దమ్ముంటే విజిలెన్స్ విచారణ కోరాలి
- అవినీతి అక్రమాలకు పాల్పడే రైస్ మిల్లు వ్యాపారులకు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అండదండలు
- ఆధారాలు సిబిఐకి ఈడీకి అందజేస్తా
- నాతో బేరాలు లేవు, రైతుల కోసం దేనికైనా సిద్ధం
- ఎక్కువ తూకం వేయలేదని రైతుల మధ్యకు వచ్చి నిరూపించాలి
- రైస్ మిల్లర్ల పై మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత సురేష్ రెడ్డి

**సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) :** రైతులను నిండా ముంచి వందల కోట్లు వెనకేసుకున్న రైస్ మిల్లులపై బీజేపీ నేత సురేష్ రెడ్డి మరోసారి ధ్వజమెత్తారు. ఇటీవల పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ ధాన్యం తరలింపు వంటి అవినీతిలో 700 కోట్ల స్కామ్ జరిగిందని ఆధారాలతో సహా బయటపెట్టిన సురేష్ రెడ్డి, తాజాగా కొన్ని రైస్ మిల్లులపై మళ్ళీ సంచలన ఆరోపణలు చేశారు. తనకు అవగాహన లేదంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులపై సురేష్ రెడ్డి ఘాటుగా స్పందించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు మీద రైస్ మిల్లర్లకు ప్రేమ ఉంటే.. రైతులను నిండా ముంచుతారా అని ప్రశ్నించారు.సివిల్ సప్లై అధికారులు, రైస్ మిల్లర్లు, గోదాం నిర్వాహకులు చేసిన అవినీతిని తాను బయట పెడితే కొందరు రైస్ మిల్లర్లకు ఎందుకంత నొప్పి అంటూ సురేష్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావుకు దమ్ముంటే పెద్దపల్లి నియోజకవర్గంలోని రైస్ మిల్లుల్లో జరిగిన కుంభకోణాలపై విజిలెన్స్ ఎంక్వైరీ నిర్వహించి రైస్ మిల్లు అక్రమ వ్యాపారులపై,కఠిన చర్యలు తీసుకునే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఇటీవల 700 కోట్ల హమాలీ చార్జీల కుంభకోణంపై తాను బయటపెట్టిన ఆధారాలను చూసి గోదాం నిర్వాహకులు, అధికారులు, రైస్ మిల్లర్లలో వణుకు పుట్టిందన్నారు.రైతుల మధ్య చర్చకు వెళ్దామా? అంటూ పెద్దపల్లి నియోజకవర్గంలో కొనుగోలు జరిపిన మొదటి రోజు మాత్రమే బస్తాకు నలభై కిలోలు తూకం వేశారని, రెండో రోజు నుంచి ఒక బస్తాకు రెండు కిలోలు అదనంగా తూకం వేశారని సురేష్ రెడ్డి ఆరోపించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లలో రైతులను నిండా ముంచలేదంటూ ఎమ్మెల్యే సహా కొందరు రైస్ మిల్లర్లు పబ్లిసిటీ చేస్తున్నారని, కానీ రెండో రోజు నుంచే క్వింటాలకు మూడు నాలుగు కిలోలు అదనంగా తూకం వేసి రైతులను నిండా ముంచారని తన దగ్గర ,ఆధారాలు,వీడియోలు కూడా ఉన్నాయని సురేష్ రెడ్డి అన్నారు. ఓవైపు రైతులను మరోవైపు ప్రభుత్వాన్ని నిండా ముంచి డబ్బులను ఎక్కడెక్కడ కొందరు రైస్ మిల్లర్లు పెట్టుబడులు పెట్టారో తనకు తెలుసని అన్నారు. ఎమ్మెల్యేకు వకల్తా పుచ్చుకొని కొందరు రైస్ మిల్లర్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరగలేదని రైతుల దగ్గర అదనపు తూకం వేయలేదని రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు నిరూపించాలనిసవాల్ విసిరారు. రైస్ మిల్ అసోసియేషన్ లోని హరిపురం గ్రామానికి,చెందిన జైపాల్ రెడ్డి గ్రామానికి వెళ్దామని అక్కడి రైతుల మధ్యలే చర్చ పెడదామని సవాల్ విసిరారు.రాజకీయాల్లోకి తాను దొంగ దందాలు చేయడానికి రాలేదని తనతో ఎమ్మెల్యే లాగా రహస్య డీల్స్ చేద్దాం అంటే కుదరదు అని సురేష్ రెడ్డి హెచ్చరించారు.పెద్దపల్లి నియోజకవర్గంలో జరిగిన ధాన్యం కుంభకోణంపై త్వరలోనే సిబిఐ,ఈడీ ని కలుస్తానని, ఆధారాలతో సహా కుంభకోణాన్ని బట్ట బయలు చేసి చర్యలు తీసుకునే వరకు మన పోరాటం ఆగదని సురేష్ రెడ్డి తెలిపారు. ధాన్యం కుంభకోణం విషయంలో కానీ రైతుల విషయంలో తన జోలికి వస్తే ప్రతిదీ,ఆధారంతో ప్రజల ముందుకు వస్తానంటూ ఘాటుగా హెచ్చరించారు.ఎమ్మెల్యే విజయరమణారావుకు దమ్ముంటే పెద్దపల్లి లో జరిగిన అనేక అవకతవకలపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరాలని సవాలు విసిరారు. త్వరలోనే మరో ఆధారంతో ప్రజల ముందుకు వస్తానని సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ,కార్యక్రమంలో సుల్తానాబాద్ మండల బీజేపీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, బండారి లత,ఎర్రం సంతోష్ రెడ్డి,మల్క భాగ్యలక్ష్మి, వలస సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# స్మశాన వాటికకు మౌలిక వసతులను కల్పించండి

**- నీటి నిల్వలు చెత్తాచెదారం వెంటనే తొలగించండి**

**- స్మశాన వాటికను సందర్శించిన వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత**

సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) : సుల్తానాబాద్ స్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కల్పించి చెత్తాచెదారాన్ని నీటి నిలువలను వెంటనే తీసివేసి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత సూచించారు.శుక్రవారం పట్టణంలో స్మశాన వాటికను సందర్శించి చెత్తతో కూడుకున్నటువంటి స్నానాలు చేసే స్థలం,బాత్రూంలు అద్వాన్నంగా ఉన్నాయని, వర్షానికి నిలిచిన నీరును తొలగించాలని చెత్త చెదారం వ్యర్థ పదార్థాలు వేయకుండా సూచన బోర్డులను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్ కు సూచించారు.

## సీఐ ఎస్ఐలను సన్మానించిన అంబేద్కర్ సంఘం సీనియర్ నేతలు

**- 12 గంటల్లో బాలసదనం బాలికలను కాపాడిన వైనం**

**సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) :** ఇటీవల సుల్తానాబాద్ పట్టణంలోని బాలసదనం నుండి ఇద్దరు బాలికలు గోడ దూకి పారిపోయిన సంఘటనలో ఇద్దరు మైనర్ బాలికలు గోడ దూకి పారిపోయిన సంఘటనపై, పోలీస్ ఉన్నతాధికారులు డీసీపీ భూక్యరామ్ రెడ్డి, ఏసీబీ గజ్జి కృష్ణ, సుల్తానాబాద్ సిఐ పొన్నమనేని రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్ తో వెంటనే స్పందించి 12 గంటల లోపే నాలుగు బృందాలను ఏర్పాటు చేసి ఇద్దరు మైనర్ బాలికల అదృశ్యాన్ని, అభ్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బాలికలను కాపాడినందుకుగాను సుల్తానాబాద్ సీఐ పొన్నమనేని రంజిత్ రావు తో పాటు, ఎస్సై చంద్రకుమార్, ఇతర పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, ఆది జాంబవ అరుంధతి రాష్ట్ర నేత కోటగిరి పాపయ్య, అంబేద్కర్ సంఘం సీనియర్ నేత సుద్దాల మాజీ ఎంపీటీసీ సభ్యులు సంకెనపల్లి లక్ష్మయ్య, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు, క్యాదాసి చంద్రమౌళి, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కల్వల శ్రీనివాస్, సీనియర్ అంబేద్కర్ సంఘం నేత న్యాతరి శ్రీనివాస్,మాజీ వార్డు సభ్యులు ఆరేపల్లి ఇలా రావు, తదితరులు సిఐ రంజిత్ రావు, ఎస్ఐ చంద్రకుమార్ ను అభినందించి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు అదృశ్యమై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకముందే, గుర్తించి, బాలికలను కాపాడడం, అభినందించదగ్గ విషయమన్నారు.



## వార్డు సమస్యల పరిష్కారంలో బాకం సాయికిరణ్ తనదైన ముద్ర

**- చైర్మన్ తో కలిసి ఆరో వార్డులో పర్యటన - సమస్యల పరిష్కారానికి వెనువెంటనే ఆలోచన**

**సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) :** సమస్యల పరిష్కారంలో భాకం సాయికిరణ్ తనదైన ముద్ర వేసుకున్నారు. ఆరవ వార్డులో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు వరదల మయం కావడంతో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణతో కలిసి పర్యటించి ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరద నీటి ప్రవాహం దారి మళ్లింపు, చెత్త చెదారం,ప్రజలకు ఇబ్బందిగా మారిన అపరిస్కృత సమస్యలపై దృష్టి సారించారు. ముఖ్యంగా ఆరో వార్డు లో ఉన్నటువంటి రోడ్ల సమస్యతో పాటు సిసి డ్రైన్ సమస్యలు అధికంగా ఉండడంతో చైర్మన్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్తూ తనదైన శైలిలో వార్డు బాట పట్టారు. ఆరవ వార్డులో కాల్వ శ్రీరాంపూర్ రోడ్డు మెయిన్ రోడ్డు పై నుండి కిందకు వస్తున్న భారీ వరద నీటి ప్రవాహం క్రింది నివాసాలలోకి వెళ్లడంతో ఆరో వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే జెసిబి ద్వారా నీటి వరద తరలింపు చేయాలని చైర్మన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. అంతేకాకుండా నూతన సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనుల నిర్మాణం పూర్తి చేయాలని వారి దృష్టికి తీసుకువెళ్లారు. వార్డులో దోమల బారిన పడకుండా, సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని వార్డు కౌన్సిలర్ భాకంసాయి కిరణ్ చైర్మన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. పర్యటనలో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఆరవ వార్డులో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భాకం సాయికిరణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణతోపాటు, ఆరేపల్లి కిరణ్, మామిడిపల్లి శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది ఆరేపల్లి వెంకటేష్,ఆరేపల్లి హేమన్ రాజ్,తదితరులు పాల్గొన్నారు.






## వర్షపు నీటి నిలువలపై మున్సిపల్ ఫోకస్

**త్వరితగతిన పైప్ లైన్ నిర్మాణం**

**సుల్తానాబాద్,జూలై 31 (జనంసాక్షి) :** వరద ఉధృతి, వర్షం నీటి నిల్వలపై మున్సిపల్ దృష్టి సారించింది. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ప్రజలు నడవడానికి వీలు లేకుండా, నీటి నిలువలు అధికంగా ఉండడంతో వెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ కమిషనర్ తిప్పరాజు రమేష్ ఏడవ వార్డు కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఉట్ల వర ప్రదీప్, వేగోళం అబ్బయ్య గౌడ్,గాదాసు మంజుల రవీందర్, కందునూరి కుమార్, గాజుల హరీష్ తదితరులు నూతన పైప్ లైన్ నిర్మాణం చేసి శాశ్వత పరిష్కారం చేశారు.





## రైస్ మిల్లులపై ఎన్ఫోర్స్మెంట్ విజిలెన్స్ దాడులు

**సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) :** కష్టం మిల్లింగ్ సిఎంఆర్ ధాన్యం నిలువల్లో జరుగుతున్న అక్రమాలను వెలికి తీసేందుకు శుక్రవారం మండలంలోని కాట్నపల్లి శివారులో గల రెండు రైస్ మిల్లులలో ఎన్ఫోర్స్మెంట్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి, తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ రీజనల్ ఎన్ఫోర్స్మెంట్ విజిలెన్స్ అధికారి బస్వారెడ్డి ఆధ్వర్యంలోని టీం తనిఖీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ దినేష్ సిఐలు అనిల్ ప్రశాంత్ ఎస్సై రాజేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పసివాడి ప్రాణాల కోసం ఆశగా ఎదురుచూపులు

## రూ.30 లక్షల చికిత్సకు దాతల చేయూత కోరుతున్న నిరుపేద కుటుంబం



**సదాశివనగర్ జూలై31 (జనంసాక్షి):** అమ్మ ఒడిలో ఆడుకుంటూ బోసినవ్వులతో ఇంటిల్లిపాదిని అలరించాల్సిన ఐదు నెలల పసిబిడ్డ ఇప్పుడు ప్రాణాలతో పోరాడుతున్నాడు. కాలేయ సంబంధిత తీవ్ర వ్యాధితో బాధపడుతున్న చిన్నారి హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, వైద్యానికి అవసరమైన భారీ ఖర్చు ఆ కుటుంబాన్ని తీవ్ర ఆవేదనలోకి నెట్టింది.గాంధారి మండల కేంద్రానికి చెందిన కర్కంపల్లి రవికుమార్?సంధ్య దంపతుల ఐదు నెలల కుమారుడికి అత్యవసరంగా ప్రత్యేక వైద్యం అవసరమని వైద్యులు సూచించారు. ఈ చికిత్స కోసం సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతుందని తెలిపడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు.

ఇప్పటికే తమ శక్తికి మించి చికిత్స కోసం ఖర్చు చేసిన తల్లిదండ్రులు, ఇకపై అవసరమైన మొత్తాన్ని సమకూర్చే పరిస్థితి లేక దాతల సహకారాన్ని ఆశ్రయిస్తున్నారు. "మా బిడ్డకు ప్రాణం పోయకుండా కాపాడండి. మీరిచ్చే చిన్న సహాయం కూడా మా బిడ్డకు కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చు" అంటూ వారు కన్నీటి పర్యంతమై వేడుకుంటున్నారు.

సమాజంలో దాతృత్వం కలిగిన ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించి, ఈ విషయాన్ని మరింత మందికి చేరవేసి పసిబిడ్డ ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో భాగస్వాములు కావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సహాయం చేయదలిచిన వారు:

**ఫోన్‌పే / గూగుల్ పే: 8367006456**

కర్కంపల్లి రవికుమార్ నెంబర్ కు సహాయం చేసి ఆదుకోవాలని కోరారు



# సాలూరలో ఘనంగా బోనాలు

**బోధన్, జూలై 31 ( జనంసాక్షి ) :** నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రంలో శుక్రవారం బోనాల పండుగను గ్రామస్తులు కలిసికట్టుగా అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ప్రకృతి అనుకూలించి రైతులకు మంచి పంటలు రావాలని అమ్మవారిని ప్రత్యేకంగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సొక్కం లావణ్య రవి, తెలంగాణ యూనివర్సిటీ ఈసీ సభ్యురాలు అల్లే లావణ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వెంకట్ పటేల్, అల్లే రమేష్, సొక్కం రవి, సురేష్ పటేల్, శంకర్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జక్రాన్‌పల్లి మండలం ఫించన్ ఇవ్వలేదన్న ఆగ్రహంతో పోస్టుమాస్టర్ పై దాడి

**జక్రాన్‌పల్లి మండలం,జూలై 31(జనంసాక్షి):** తొర్లికొండ గ్రామ పోస్టాఫీసులో విధులు నిర్వహిస్తున్న పోస్ట్‌మాస్టర్ శ్రీ అక్కినపల్లి సందీప్, ఈ రోజు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న సమయంలో, అదే గ్రామానికి చెందిన అబ్జర్సన్ అనే వ్యక్తి తన అక్కకు పింఛన్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నిస్తూ, అసభ్య పదజాలంతో పోస్ట్‌మాస్టర్‌ను దూషించాడు.అనంతరం, శ్రీ అక్కినపల్లి సందీప్ చెంపపై చేతితో కొట్టి, ప్రభుత్వ విధుల నిర్వహణకు ఆటంకం కలిగించాడు.ఈ ఘటనపై శ్రీ అక్కినపల్లి సందీప్ గారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, జక్రాన్‌పల్లి పోలీసులు సదరు నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# సర్ ప్రక్రియలో బిఎల్ఏ లే కీలకం..

**- కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి**

**ఆర్మూర్,జూలై 31(జనంసాక్షి):** సర్ ప్రక్రియను బిఎల్ఏలు వేగవంతం చేయాలని,వారి పాత్రే ప్రధాన కీలకమని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి శ్రీ సాయి ఫంక్షన్ హాల్ లో ప్రత్యేక సమగ్ర సవరణ సర్ బిఎల్ఏ లకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఓటు అనేది ఓటరుదారు నైతిక హక్కు అని,ఒక్క ఓటు కూడా కోల్పోకుండా బిఎల్ఏలు చూడాలన్నారు.మాజీ సీఎం కేసీఆర్ దరిద్రమైన పాలనలోనే ప్రభుత్వ అధికారుల్లో అవినీతి పెరిగిందన్నారు.పర్సంటేజీలు మానుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు హితవు పలికారు.కాంగ్రెస్ ఓట్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందన్నారు.పచ్చిమ్ బెంగాల్,ఢిల్లీ ఎన్నికల్లో 30 లక్షల ఓట్లు ను బీజేపీ కొల్లగొట్టి గెలిచిందన్నారు. నీట్ లీకేజీ లో కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని చెప్పుకొచ్చారు.డిల్లీ జంతర్ మంతర్ లో విద్యార్థుల ఉద్యమ పాత్ర అబిందనీయమన్నారు.రైతులు వరి ధాన్యం పైనే కాకుండా,కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు రాష్ట్ర ముఖ్య సలహాదారు సుదర్శన్ జన్మదినంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ వినయ్ రెడ్డి కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు నాగేష్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి,తెలంగాణ మినరల్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్,నుడా చైర్మన్ కేశ వేణు,తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్బిన్,జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ మారా చంద్రమోహన్ రెడ్డి,బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జీ సునీల్ రెడ్డి,ఆర్మూరు కాంగ్రెస్ నాయకులు ఆకుల లలిత,ఆర్మూర్ నియోజకవర్గ ఐదు మండలాల అధ్యక్షులు,ఆర్మూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా గౌడ్,నియోజకవర్గ గ్రామాల సర్పంచులు,బిఎల్యు సూపర్వైజర్లు,బూత్ ఇన్చార్జిలు కాంగ్రెస్ పట్టణ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ చాకచక్యంతో తప్పిన పెను ప్రమాదం..

## అన్నన్‌పల్లి సమీపంలో బస్సు ప్రమాదానికి గురి

## రోడ్డు వెడల్పు లేకపోవడమే ప్రమాదానికి కారణమని డ్రైవర్ వ్యాఖ్య



**సిరికొండ జూలై 31 (జనంసాక్షి ):** నిజామాబాద్ నుండి కుర్థాల్ పేట్ కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు శుక్రవారం అన్నన్‌పల్లి సమీపంలో ప్రమాదానికి గురైంది. అయితే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.ప్రమాదం అనంతరం డ్రైవర్ మాట్లాడుతూ, రోడ్డు తగినంత వెడల్పు లేకపోవడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ఈ సంఘటనతో కొద్దిసేపు ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, ప్రయాణికులు ఆ రహదారిని వెంటనే విస్తరించాలని అధికారులను కోరుతున్నారు.

# ఆల్ఫోర్స్ లో ఘనంగా గోరింటాకు సంబరాలు

**- గోరింటాకు చల్లదనంతో పాటు వేడిని తగ్గిస్తుంది**

**- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి**



**సుల్తానాబాద్,జూలై 31(జనంసాక్షి) :** గోరింటాకు శరీరానికి చల్లదనంతో పాటు వేడిని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థినీలచే ప్రత్యక్షంగా గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆషాడ మాసంలో మహిళలంతా సామూహికంగా ప్రత్యక్షంగా జరుపుకునే పండుగ అని, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకంగా నిలిచే అందమైన వేడుకని అన్నారు. డిజిటల్ యుగంలో మన పండుగలకు ప్రాధాన్యత తగ్గుతున్నప్పటికీ ఆల్ఫోర్స్ లో విద్యార్థులకు ప్రతి అంశంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు, దీంతో విద్యార్థుల్లో అవగాహన పెరగడంతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల ఆసక్తి పెంపొందుతుందన్నారు. వివాహాలు, శ్రావణమాసం, బతుకమ్మ, వరలక్ష్మి, వ్రతం వంటి వేడుకలతో పాటు ప్రతి శుభకార్యాలలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం సాంప్రదాయంగా వస్తుందన్నారు. మహిళల చేతులకు అందంతో పాటు చల్లదనం ఇవ్వడంలో సహాయపడుతుందన్నారు. ఇలాంటి సాంప్రదాయాలు మన కుటుంబ బంధాలను మరింత దృఢ పరుస్తాయని, గోరింటాకు వేడుకలను ప్రతి ఏటా నిర్వహించి మన వారసత్వ భావితరాలకు అందించే గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ వేడుకలో విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో విద్యార్థినీలతో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రాష్ట్ర సలహాదారుడికి వినతి

**ఆర్మూర్,జూలై 31 (జనంసాక్షి):** సంవత్సరాల నుండి పెరుగుతున్న విద్యార్థుల ప్రవేశాలకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాదారు,ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మాజీ సర్పంచ్,వార్డు కౌన్సిలర్ రవి గౌడ్,నాయకులతో కలిసి శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు.ఈ విషయంపై రాష్ట్ర సలహాదారు సానుకూలంగా స్పందించారు.



# బస్వాపూర్ లో వైభవంగా ఊర పండగ ప్రారంభం

**భిక్కనూరు జులై 31 (జనం సాక్షి):** భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో శుక్రవారం ఊర పండగ కార్యక్రమంలో భాగంగా డప్పు చప్పులతో బొడ్రాయిని గ్రామంలో పలు వీధుల గుండా ఊరేగించారు,అనంతరం గ్రామ కూడలిలో బొడ్రాయిని ప్రతిష్టించారు,అనంతరం గ్రామస్తులు గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు,ఈసందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి 5సంవత్సరాలకు ఒక్కసారి ఊరపండగ అంగరంగ వైభవంగా గ్రామస్తుల సహకారంతో ఏర్పాట్లు చేసి నిర్వహిస్తామని తెలిపారు, ఈపండగ ముఖ్య ఉద్దేశం గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు, పశుసంపద అమ్మవారి కృపతో గ్రామస్తులు చల్లగా ఉండాలని కోరికతో పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు,ఈక్రమంలో గ్రామ సర్పంచ్ తుడుం పద్మ స్వామి,ఉపసర్పంచ్ కార్తిక్ రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రవీంధర్ సింగ్ ఆరోపణలు నిరాధారం.. క్షమాపణ చెప్పాలి: యాదగిరి సునీల్ రావు

## యూడీఎఫ్ టెండర్లపై అవినీతి ఆరోపణలు అవాస్తవమని స్పష్టం

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై అసత్య ప్రచారం చేస్తే న్యాయపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక




కరీంనగర్ బ్యూరో, జూలై 31 (జనం సాక్షి): బీఆర్ఎస్ నాయకుడు రవీంధర్ సింగ్ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్రంగా ఖండించారు. యూడీఏఫ్ (జఆఈ) పథకం టెండర్లలో రూ.30 నుంచి రూ.40 కోట్ల అవినీతి జరిగిందంటూ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని విమర్శించారు. కరీంనగర్ లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆరోపణలు చేసే ముందు రవీంధర్ సింగ్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.కరీంనగర్ నగర అభివృద్ధికి యూడీఏఫ్ పథకం కింద రూ.180 కోట్లకు పరిపాలనా అనుమతి లభించగా, అభివృద్ధి పనులకు సంబంధించిన ఈసీవీ (ఇఅఒ) విలువ రూ.137 కోట్లేనని వివరించారు. టెండర్లను నిర్వహించి ఆమోదం తెలిపేది రాష్ట్ర ప్రభుత్వ మేనని, అలాంటప్పుడు రూ.30?40 కోట్ల అవినీతి జరిగిందనే ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని ప్రశ్నించారు.రవీంధర్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన సునీల్ రావు, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను అదే కాంట్రాక్టు సంస్థకు అప్పగించారని గుర్తు చేశారు. మిడ్ మానేరు, గౌరవెల్లి, తోటపల్లి, మల్లన్నసాగర్, భక్తరామదాసు వంటి ప్రాజెక్టు లను అదే సంస్థ నిర్మించిందని పేర్కొంటూ, అప్పట్లో టెండర్ల ప్రక్రియపై ఎందుకు ప్రశ్నించ లేదని నిలదీశారు.ఎక్సెస్ టెండర్లపై ఇప్పుడు విమర్శలు చేస్తున్న రవీంధర్ సింగ్, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో మేయర్‌గా, సివిల్ సప్లైస్ చైర్మన్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటి టెండర్లపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా ఆయనదేనని అన్నారు.కరీంనగర్ మానేరు రివర్‌ఫ్రంట్ పనులు రూ.546 కోట్లతో కొనసాగుతున్నాయని, అందులో కేవలం 4 శాతం ఎక్సెస్ టెండర్ మాత్రమే ఉందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన చెక్‌డ్యాంలు, ప్రాజెక్టులు, స్మార్ట్ సిటీ పనుల టెండర్లపై కూడా బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కరీంనగర్‌ను యూసీఎఫ్ (జఆఈ) పథకంలో చేర్చి నగర అభివృద్ధికి రూ.840 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారని సునీల్ రావు పేర్కొన్నారు. ఆయనపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు బొంతల సత్యనారాయణ రెడ్డి, వంగల పవన్, బండారి వేణు, కొలిపాక శ్రీనివాస్, పొన్నం మొండయ్యతో పాటు బీజేపీ నాయకులు పండుగ నాగరాజు, వాసు, భాస్కర్, హమీద్, రాజ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ చేయడానికి రిటైర్డ్ మెంట్ ఉండదు: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



గోదావరిఖని, జనంసాక్షి : రిటైర్డ్ మెంట్ ఉద్యోగానికే కానీ సేవచేయడానికి ఉండదని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జిడికె 11వ గనిలో ఉద్యోగిగా పదవీ విరమణ పొందిన శ్రమశక్తి అవార్డు గ్రహిత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్, కార్మిక నాయకుడు పి.మల్లి కార్జున్ దంపతులను మంత్రి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాకా వెంకటస్వామి ఉన్న సమయం నుంచి తనతో పాటు ఎంపీ వంశీ కృష్ణకు సలహాలు ఇస్తూ మల్లికార్జున్ మా కుటుంబంతో సన్నిహితంగా ఉంటూ వచ్చా న్నారు. ఉద్యోగానికి రిటైర్డ్ అయినా ప్రజలకు సేవ చేసే అవకాశం వదులుకోవద్దన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్, నగర మేయర్ మహంకాళి స్వామి, మాజీ ఎమ్మెల్సీ బి.వెంకట్రావు, ఎన్ఎస్‌పీసీ నేషనల్ ఎన్సీసీ మెంబర్ బాబర్ సలీంపాషా, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మడ్డి ఎల్లయ్య, గని మేనేజర్ జాన్సన్, ఫిట్ ఇంజినీర్ శ్రీనివాస్, టీబీజీకెఎస్ ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ మాధవరావు, పి.శ్యామ్ సుందర్, దయానంద్ గాంధీ, కెఎస్ వాసు, డి.శంకర్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ కె.రాజేందర్, బంక రామస్వామి, డాక్టర్ రాజేంద్రకుమార్, ఎం.సారయ్య, గంగాధర్, లయన్స్ క్లబ్ రాయల్ ప్రెసిడెంట్ బాలసాని కొమురయ్య, సెక్రెటరీ యుగంధర్ రెడ్డి, కాంగ్రెస్ లీడర్లు కామ విజయ్, తిప్పారపు మధు, అనుమాస శ్రీనివాస్, ఎండి సజ్జద్, గనిలోని వివిధ షిఫ్ట్ లకు చెందిన కార్మికులు, తదితరులు పాల్గొని మల్లికార్జున్ ను ఘనంగా సన్మానించారు.

**కొత్త గనులు వస్తేనే సింగరేణికి మనుగడ**

**ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి**

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి**

కొత్త గనులు వస్తేనే సింగరేణి సంస్థకు మనుగడ ఉంటుందని, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర కార్మిక, ఉపాధి, మైనింగ్ శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి జీడికె 11వ గనిలో రాష్ట్ర ప్రభుత్వ శ్రమశక్తి అవార్డు గ్రహిత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ పి.మల్లికార్జున్ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరైన మంత్రి కార్మికులను ద్దేశించి మాట్లాడారు. గత పదేళ్ళ బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిం చిన వేలంలో పాల్గొనకపోవడం వల్ల ఒక్క బొగ్గు బ్లాక్ కూడా రాలేదన్నారు. దీనివల్ల కార్మికుల్లో అభద్రతాభావం పెరగడంతో పాటు సంస్థ ఆర్థికంగా ఇబ్బందుల్లోకి వెళ్ళిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంచిర్యాల జిల్లాలో కొత్తమైన్ ఆర్ కె ఓపెన్ కాస్ట్ వచ్చిందని, దీనివల్ల చాలామందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఒత్తిడి మేరకు తాడిచర్ల బ్లాక్ 2 కూడా సింగరేణికి కేంద్రం కేటాయించిందని చెప్పారు. సత్తుపల్లి, కోయగూడెంలోని డిప్ సైడ్ కోల్ బ్లాక్ లు ప్రైవేటు కంపెనీల పరం కావడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని, అవి ప్రారంభం కానందున వాటిని కూడా సింగరేణికి కేటాయించేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణలో మరికొన్ని చోట్ల ఉన్న కోల్ బ్లాక్ లు సింగరేణికి దక్కేలా వేలంలో సంస్థ పాల్గొంటుందని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ప్రస్తుతం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో సాగుతున్న సింగరేణి సంస్థ 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి చేరుకోవాలని, అప్పుడే సంస్థకు, కార్మికులకు మంచి జరుగుతుందని, అధిక బోనస్ తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఇక గడిచిన బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో కాంట్రాక్టు కార్మికులను పట్టించుకున్న పాపానపోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మిక సంఘాలు, సీఐటీతో మాట్లాడి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేలా చర్యలు తీసుకున్నామని, ఇది రాష్ట్ర చరిత్రలో గొప్ప విజయమని చెప్పారు. సింగరేణిలో కూడా కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెంపు, పర్మినెంట్ కార్మికుల సొంతింటి కల, మెడికల్ బోర్డు నిర్వహణ, తదితర సమస్యలపై చర్చించేందుకు త్వరలోనే సీఎంతో మీటింగ్ జరగనున్నదని మంత్రి చెప్పారు.



## పత్తి పంటలను పరిశీలించిన ఏవో అనూష

ముత్తారం జూలై 31(జనంసాక్షి) ముత్తారం మండలంలోని ముత్తారం,మైదంబండ,మచ్చుపేట గ్రామాల్లోని పత్తి పంట క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి అనూష శుక్రవారం సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు.ఇటీవల మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పొలాల్లో నిల్వ ఉన్న నీటిని కాల్వల ద్వారా వెంటనే బయటకు పంపించాలని రైతులకు సూచించారు. అలాగే,నీరు నిలిచిన ప్రాంతాల్లో వేరుకుళ్లు వచ్చే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో డ్రెంచింగ్ చేయడంతో పాటు 19-19-19 ఎరువును ఆకులపై పిచికారీ చేయాలని రైతులకు అవగాహన కల్పించారు.అదేవిధంగా పత్తి పంటలో ఆకు రసం పీల్చే పురుగుల ఉధృతి ఉన్న చేన్లలో మోనోక్రోటోఫాస్‌ను 1:4 నిష్పత్తిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కె,మనీషా, బి. శశిధర్ తోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఆగస్టు నెలలో మూడు నెలల బియ్యం పంపిణీ

### ఈ కేవైసీ గడువు ఆగస్టు 30 వరకు పొడిగింపు



భిక్కనూరు జూలై 31 (జనం సాక్షి): భిక్కనూరు మండల కేంద్రంలో గల రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్ సునీత మాట్లాడుతూ ప్రజా పంపిణీ ద్వారా ఉచిత రేషన్ బియ్యం ఆగస్టు,సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన 3 నెలల ఉచిత రేషన్ బియ్యాన్ని ఆగస్టు నెలలో ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో రేషన్ బియ్యం తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు, ఈ కేవైసీ పూర్తిగాని లబ్దిదారులు ఆగస్టు 30 వరకు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ పీ.వీ శ్రీనివాస్, ఆర్.ఐ నజీముద్దీన్, సిబ్బంది పరమాత్మ గౌడ్, అనిల్, రాజు, వివిధ గ్రామాల జి.పి.ఓ లు పాల్గొన్నారు.

## సిరికొండ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని సందర్శించిన డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్

### కార్యాలయ నిర్వహణ, అటవీ సంరక్షణ చర్యలు, పెండింగ్ పనులు, సిబ్బంది పనితీరుపై సమీక్ష



సిరికొండ, జూలై 31 (జనం సాక్షి): నిజామాబాద్ జిల్లా సిరికొండ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) ప్రశాంత్ బాజీరావు పాటిల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్వహణ, అటవీ సంరక్షణకు చేపడుతున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, సిబ్బంది విధుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.అటవీ సంపదను పరిరక్షించడంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎఫ్‌వో సూచించారు. అడవుల్లో అక్రమ కలప రవాణా, అటవీ భూముల ఆక్రమణలు, వన్యప్రాణుల సంరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల్లో అటవీ సంరక్షణపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

అదేవిధంగా కార్యాలయ రికార్డులు, పరిపాలనా వ్యవహారాలు, పెండింగ్ ఫైళ్లను పరిశీలించిన డీఎఫ్‌వో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అటవీ శాఖ ప్రతిష్ఠను పెంచేలా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డీఎఫ్‌వో చంద్రశేఖర్ రావు, సిరికొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్‌వో) కె. నర్సింగారావు, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో గంగారాంతో పాటు ఫారెస్ట్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# నిజాయితీని చాటుకున్న కస్తూరి సంతోష్

## పోగొట్టుకున్న 10 గ్రాముల బంగారాన్ని అందజేసిన సంతోష్



**మల్లాపూర్,జులై31(జనంసాక్షి)**
మండలం వేంపల్లి వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తోట పెద్ద రాజారెడ్డి 60 అనే వ్యక్తి మల్లాపూర్ మండల కేంద్రంలోని కస్తూరి సంతోష్ కిరాణంలో సుమారు 10 గ్రాముల బంగారాన్ని మర్చిపోగా సంతోష్ తోట పెద్ద రాజారెడ్డి అనే వ్యక్తిని పిలిపించి అతనికి అందజేశాడు. ఈ రోజులలో పోయిన బంగారం దొరకుడు అంటే గమ్యమే అలాంటి పరిస్థితులలో కస్తూరి సంతోష్ అనే వ్యక్తి నిజాయితీతో అతనికి పొద్దున నుండి సుమారు పదిసార్లు ఫోన్ చేసి పిలిపించి అతనికి అందజేశాడు. అతనిని పలువురు గ్రామస్తులు అభినందించారు. ఈ రోజులలో ఇలాంటి వ్యక్తి ఉండడం చాలా అరుదు అని అన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన



**శంకరపట్నం, జూలై 31 జనం సాక్షి**
ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది అడపాదడపా వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పరిస్థితులను అంచనా వేసుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం తాడికల్, కరీంపేట గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ, పంటల నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, తక్కువ వర్షాలకు ఆకర్షితులై అధిక విస్తీర్ణంలో వరి సాగుకు వెళ్లడం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల తక్కువ కాల వ్యవధిలో పండే, తక్కువ నీటి అవసరం ఉండే పప్పు దినుసులు, నూనెగింజల పంటలు, చిరుధాన్యాలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వర్షపు నీటిని వృథా కాకుండా ఫాం పాండ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని వివరించారు. అలాగే పంటల నిర్వహణ, సాగు యాజమాన్య పద్ధతులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యవసాయ విధానాలపై రైతులకు సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి వినియోగాన్ని తగ్గిస్తూ అధిక లాభదాయకమైన పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. శ్రీధర్, వ్యవసాయ అధికారి జి.వెంకటేష్, తాడికల్ సొసైటీ చైర్మన్ కీసర సంపత్, కరీంపేట గ్రామ సర్పంచ్ శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారులు స్రవంతి, ఆరతి తదితరులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

# ఇళ్లను పరిశీలించిన తహసీల్దార్ శాంత

జనం సాక్షి,ధర్పల్లి జూలై 31.
భారీ వర్షాల కారణంగా ధర్పల్లి మండలం ఉమ్మడి దుబ్బాక డీబీ తండా, మరియా తండాల్లో కూలిన ఇళ్లను తహసీల్దార్ శాంత శుక్రవారం పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకుని అవసరమైన సహాయ చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరూ నివసించవద్దని, ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నందున సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం తరపున బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## అంగన్వాడీ, ఆయాల పోస్టులకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన:బోధన్ సీడీపీఓ నందిని

**బోధన్, జూలై 31 ( జనంసాక్షి ) :**
అంగన్వాడి టీచర్, ఆయా పోస్ట్ ల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని బోధన్ సీడీపీఓ నందిని శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐసిడిఎస్ బోధన్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ టీచర్ మరియు అంగన్వాడి ఆయా పోస్ట్ కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ దువపత్రాలను ఈనెల 27వ తేదీ నుంచి ఆగస్టు 5 వరకు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలు వెరిఫికేషన్ శుక్రవారం జరిగినప్పటికీ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు చాలామంది రానందున ఆగస్టు 5వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కి రావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకొని ఐసిడిఎస్ బోధన్ కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కోరారు. లేనియెడల అట్టి దరఖాస్తులను పరిగణలోకి తీసుకొనబడవని సీడీపీఓ నందిని స్పష్టం చేశారు.




## ఎస్సైగా ప్రమోషన్ పొందిన ఎండి అలిముద్దీన్ కు కథలాపూర్ మాజీ ఎంపీపీ సన్మానం

**కథలాపూర్ జూలై 31 (జనంసాక్షి)**
కథలాపూర్ మండలంలో ఏ ఎస్ ఐ గా చేసి కోరుట్ల కి బదిలీ అయిన అలీముద్దీన్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ కోరుట్లలోని ఎస్సైగా ప్రమోషన్ పొందిన ఎండి అలీముద్దీన్ కి కథలాపూర్ మండలం మాజీ ఎంపీపీ చిరు సన్మానం ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ,నాంపల్లి లింబాద్రి గారు ,మరియు తోపారపు నరసయ్య, వేల్పుల రాజు,చిట్యాల మహేష్, ఆలుగోటు ప్రమోద్, మండలోజి శ్రీనివాస్, వెంకటస్వామి ,తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో శ్రీకాంత్



**మల్లాపూర్ జులై 31 (జనంసాక్షి)**
మండలం లోని పాతదేమరాజు పల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి పిల్లలతో కలిసి భోజనం చేసిన ఎంపీడీవో శ్రీకాంత్స,ర్పంచ్ రోడ్ల రాజేశ్వరి రాజారెడ్డి, అలాగే గోదావరి నది వరద ప్రవాహం ఎక్కువైనందున ఎంపీడీవో పరిశీలించారు, అదే గ్రామానికి చెందిన మందపల్లి బాలకిషన్ ఇల్లు భారీ వర్షాలకు కూలిపోవడంతో పరిశీలించారు.

# భారీ వర్షానికి కుప్పకూలిన ఇల్లు విలాసాగర్‌లో వర్ష బీభత్సం



**బోయిన్ పల్లి జులై 31 (జనంసాక్షి)**
రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఓ నివాస గృహం కూలిపోయింది. గ్రామానికి చెందిన మల్యాల శంకరయ్య ఇంటి పైకప్పు పూర్తిగా కూలిపోగా, ఇంట్లోని సామగ్రి ధ్వంసమైంది. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు బయట ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నష్టం వివరాలను తెలుసుకుని ధైర్యం చెప్పారు. భారీ వర్షాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు గృహ నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని అందించాలని గ్రామస్థులు కోరారు.

## గుర్తు తెలియని శవం లభ్యం



**బోధన్, జూలై 31 ( జనంసాక్షి ) :**
బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అచన్ పల్లి, వినాయక్ నగర్ సమీపంలో ఉన్న ఒక నీటి గుంటలో సుమారు 55 నుండి 60 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైనదని బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిసిన వివరాలు మృతుడు గులాబీ రంగు టీ-షర్ట్, గులాబీ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుడు అనారోగ్యం కారణంగా గానీ లేదా మద్యం మత్తులో జారిపడి బురద నీటిలో మునిగి, కంటికి గాయమై మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానించడం జరిగిందన్నారు. గుర్తు తెలియని బాడీ గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాము, చుట్టుపక్కల విచారించగా మృతుడి వివరాలు లభ్యం కాలేదు. కావున, మృతుడి ఆచూకీ లేదా వివరాలు తెలిసిన వారు వెంటనే బోధన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను కానీ, లేదా క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. ఫోన్ నంబర్లు 8712659870, 8712659778.

# ధర్మపురి స్మశానవాటిక పరిస్థితి దారుణం..

## వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్

**ధర్మపురి జగిత్యాల జిల్లా జులై 31(జనంసాక్షి) :** అయ్యా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి కాంగ్రెస్ నాయకుల్లారా స్మశాన వాటిక పరిస్థితి ఒకసారి చూడండి. ఎంతో అద్భుతంగా కట్టిన స్మశాన వాటిక ప్రకృతి వైపరిత్యంతో కొంత భాగం షెడ్లు, గోడ కూలిపోతే నానా హైరానా చేశారు. మీరు గెలిచి ఈరోజు వరకు 2 సంవత్సరాల 7 నెలల 26 రోజులు అయింది. కనీసం ఉన్న స్మశాన వాటికను పరిశుభ్రంగా ఉంచడం చేత కావట్లేదా మీకు ఇక్కడ రూమ్ లకి డోర్లు లేవు, కరెంటు లేదు, టాయిలెట్స్ లలో నల్లాలు లేవు. వర్షాకాలం ఎవరు అయినా చనిపోతరు ఇప్పుడు పరిస్థితి ఏమిటి. చాలా మంది 11 వ రోజు కర్మ కార్యక్రమం రోజు పిండం పెట్టినతర్వాత అక్కడ కూర్చొని భోజనం చేస్తారు. ఇక్కడ అపరిశుభ్రత వలన చనిపోయిన కుటుంబ సభ్యులు ఇక్కడ కూర్చొని తినడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.మేము కట్టిన స్మశానం ని మంచిగా చేయాలని ఉద్దేశం మీకు లేకుంటే నూతన స్మశాన వాటిక నిర్మాణం చేసి ధర్మపురి ప్రజలకు ఉపయోగపడేలా చేయండి.అప్పుడు స్మశాన వాటిక







నిర్మాణానికి బిక్షాటన ఉద్యమం చేసిన వ్యక్తులు అందరూ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ లో పెద్ద పదవులను అనుభవించుతున్నారు.వాళ్ళందరూ ఇప్పుడు నోరు తెరుస్తలేరు మరి.ఓట్ల కోసం రాజకీయం చేయడం తప్ప మీకు ప్రజలకు మంచి చేయాలని అనిపిస్తే ఒక్కసారి ధర్మపురి స్మశాన వాటిక ఏలా ఉందో చుడండి.




## మానవసేవయే మాధవసేవ
## రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడుదాం

**కరీంనగర్ కరీంనగర్ జిల్లా 31జులై (జనంసాక్షి) :** తెలంగాణ శ్రీనివాసులు సేవా సంస్థ ఆధ్వర్యంలో సమాజంలో స్వచ్ఛంద రక్తదానం పట్ల అవగాహన పెంపొందించేందుకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. భగవంతుడికి సేవ చేసే అవకాశం ప్రతి ఒక్కరికీ ప్రత్యక్షంగా లభించకపోయినా, ఆపదలో ఉన్న రోగికి రక్తదానం చేయడం ద్వారా నిజమైన మానవసేవ చేయవచ్చని పేర్కొన్నారు.ఒక క్యాన్సర్ బాధితుడికి అత్యవసరంగా : పాజిటివ్ రక్తం అవసరమని సమాచారం అందగానే వెంటనే స్పందించి రక్తదానం చేసిన శ్రీ శంకర్ మాజీ సైనికుడుని తెలంగాణ శ్రీనివాసులు సేవా సంస్థ సభ్యులు హృదయపూర్వకంగా అభినందించారు. అదేవిధంగా, మరో రోగికి ం నెగెటివ్ రక్తం అత్యవసరంగా అవసరమైన సందర్భంలో ప్రభుత్వ ఆసుపత్రి ఖఖీా శ్రీ వెంకటేష్ ను సంప్రదించగానే వెంటనే స్పందించి అవసరమైన రక్తాన్ని సమకూర్చి తన మానవత్వాన్ని చాటుకొన్నారని కొనియాడారు. ఈ సందర్భంగా తెలంగాణ శ్రీనివాసులు సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి మాట్లాడుతూ, యువతతో పాటు ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా, నిరంతరం రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. "మీరు దానం చేసే ఒక్క యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని కాపాడగలదు. రక్తదానం మహాదానం మాత్రమే కాదు, మానవత్వానికి ప్రతీక" అని ఆయన అన్నారు.
సమాజంలో రక్త కొరతను నివారించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదాతలుగా నమోదు చేసుకుని అవసరమైన సమయంలో స్పందించాలని కోరింది. మీ పెళ్లి రోజు, పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదాతలుగా నిలుస్తారని, ఇప్పటి వరకు తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ తరుపున 2650 మంది శ్రీనివాసులు రక్తదానం చేశారని తెలంగాణ శ్రీనివాసులు సేవా వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి తెలిపారు.

## పోక్సో కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

**రామగిరి జనం సాక్షి జూలై 31:**
రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది.శిక్ష పడిన నిందితుడు ఎండీ రహీంపాషా (36), తండ్రి కాజమియా, శివరాం నగర్, పన్నూర్ గ్రామం, రామగిరి మండలం, పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు.2020 నవంబర్ 5న తన 14 ఏళ్ల కుమార్తె ఇంటి నుంచి కనిపించకుండా పోయిందని బాధితురాలి తండ్రి రామగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు క్రైమ్ నంబర్ 138/2020గా ఐపీసీ సెక్షన్ 363 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో బాధితురాలిని గుర్తించి ఆమె వాంగ్మూలం నమోదు చేయగా, నిందితుడు ప్రేమ వివాహం పేరుతో మోసపూరితంగా ఆమెను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు వెల్లడైంది. దీంతో సేకరించిన ఆధారాల మేరకు ఐపీసీ సెక్షన్లు 366-ఏ, 376(2)××తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 6ను కేసులో చేర్చి కోర్టులో ఆల్టరేషన్ మెమో దాఖలు చేశారు.అప్పటి ఏసీపీ వి. ఉమేందర్, ఎస్ఐ ఏ. మహేందర్ దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. అనంతరం చార్జిషీట్‌ను కోర్టులో సమర్పించారు.పెద్దపల్లి పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ అనంతరం న్యాయమూర్తి శ్రీమతి స్వప్నరాణి ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలను పరిశీలించినిందితుడిపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించారు. దీంతో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో నేరం రుజువై నిందితుడికి శిక్ష పడడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ డొంకెన రవీందర్, భరోసా లీగల్ కౌన్సిలర్ ఎం. సాధ్యారాణి కీలక పాత్ర పోషించారు.పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి, ఏసీపీ మడుతా రమేష్ పర్యవేక్షణలో సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో సహకరించిన సీఐ బుద్దె స్వామి (మంథని), ఎస్ఐ టీ. శ్రీనివాస్ (రామగిరి), కోర్టు కానిస్టేబుల్ ఎస్.కే. షాహబాజ్, లైజన్ ఆఫీసర్ పి. కోటేశ్వరరావులను రామగుండం పోలీస్ కమిషనర్, డీఐజీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.



**మృతుని కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ**

**ముత్తారం, జూలై 31 (జనంసాక్షి):** ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన ఉడుత సదానందం ఇటీవల మృతి చెందగా శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులను రజిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి పరామర్శించి.25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన ఆయన, కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అవసరమైన వారికి సహాయం అందించడం రజిత ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రజిత ఫౌండేషన్ ఆర్గనైజర్ మొగిలి శ్రీనివాస్, వార్డు సభ్యులు కోలిపాక లక్ష్మి చంద్రయ్య, నరేడ్ల రమేష్, సభ్యులు షేరు స్వామి, బొమ్మిడి మల్లన్న, బిక్కినేని సుధాకర్ రావు, నాగుల ఓదెలు, కట్టేకోల మల్లయ్య, కొలిపాక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వీణవంక ఘనంగా పదవి విరమణ వీడ్కోలు

### ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌రాజిరెడ్డి

**వీణవంక జూలై 31 (జనంసాక్షి)**
వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజిరెడ్డి పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం రోజున ప్రభుత్వ కళాశాల తోటి అధ్యాపకుల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించి వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ రాజిరెడ్డి తో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు.వారు నిరాడంబర వ్యక్తిత్వం,క్రమశిక్షణ,విద్యార్థుల పట్ల చూపిన ఆప్యాయత,సహోద్యోగులతో సత్సంబంధాలు,విద్యారంగ అభివృద్ధికి అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.ప్రిన్సిపాల్ రాజిరెడ్డి సేవలు కళాశాల అభివృద్ధికి చిరస్మరణీయమని పేర్కొంటూ ఘనంగా సత్కరించి శాలువా,జ్ఞాపిక అందజేశారు.ప్రిన్సిపాల్ రాజిరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న పిల్లలు మంచిగా విద్యాభ్యాసం చేసి కాలేజ్ కు మంచి పేరు తేవాలని విద్యార్థులకు తెలియజేశారు. నాతో కలిసి పనిచేసిన అధ్యాపకులకు,నాకు సహకరించిన అధికారు లకు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీందర్, గ్రంథపాలకుడు రామ్మోహన్, కతెరశాల,జైపాల్ రెడ్డి,శోభన్ బాబు, కల్పన,కరుణ,సుమలత,స్వప్న, శైలజ,తాజుద్దీన్,జమీల్,రాజశేఖర్ తదితరులు పాల్గొని పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. రాజిరెడ్డి, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,కుమారులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అనంతర నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు,సుఖసంతోషాల మధ్య జీవితం కొనసాగాలని అందరూ ఆకాంక్షిస్తూ ఘనంగా వీడ్కోలు పలికారు.



# హిందీ కవి మున్షీ ప్రేమచంద్ జయంతి

**సిరిసిల్ల టౌన్ జూలై 31 (జనం సాక్షి)**
హిందీ కవి ప్రేమ్ చంద్ అనేక సామాజిక, రాజకీయ కథలు వెలువరించారని పలు భాషల్లోకి అనువదించబడ్డాయని, హిందీ పండితో పాధ్యాయులు పరకాల రవీందర్ అన్నారు. సిరిసిల్లలోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ సాహిత్య జగత్తుకు విశిష్ట సేవలందించిన ఉపన్యాస సమ్రాట్ మున్షీ ప్రేమచంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం హిందీ ఉపాధ్యాయులు పర్కాల రవీందర్ మాట్లాడుతూ, ప్రేమచంద్ తన కథలు, నవలల ద్వారా సమాజంలోని పేదరికం, అసమానతలు, రైతుల జీవన విధానం, సామాజిక న్యాయం వంటి అంశాలను వాస్తవికంగా చిత్రించి హిందీ సాహిత్యానికి చిరస్మరణీయ సేవలందించారని తెలిపారు. ఆయన రచనలు నేటికీ విద్యార్థులకు ఆదర్శ ప్రాయమని పేర్కొన్నారు. ప్రధానో పాధ్యాయులు మాట్లాడుతూ ప్రేమచంద్ సాహిత్య స్ఫూర్తిని ప్రతి విద్యార్థి జీవితంలో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన చిత్రాలు అందరినీ ఆకట్టుకు న్నాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు సామల రాజీవ్, విశ్వతేజ, అభిరామ్ లకు బహుమతులు అందజేసి అభినందించారు.



ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీమతి. నాగుల రమాదేవి, ఉపాధ్యాయులు పొలాస మల్లేశం, ఐత సత్యనారాయణ, సామల రమాదేవి, సిరిపురం జ్యోతి, జంగిటి భానుచందర్, చొప్పదండి రమాదేవి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తరాలకు వారధిగా.. మార్గదర్శిగా..

# సెలవులకే సెలవు, వందశాతం హాజరు..

○సమాజ సేవకై నిరంతర తపన.. ○నీటిరంగ నిపుణుడు కూడా..

○ప్రధానోపాధ్యాయులు చకినాల శ్రీనివాస్..






**సిరిసిల్ల టౌన్ 31(జనంసాక్షి)**
చేస్తున్న వృత్తిలోనూ, ప్రవృత్తి లోను స్వచ్ఛంగా అంకితభావంతో అతని ఆచరణ భవిష్యత్ తరాలకు మార్గం చూపుతూ వారధిలా కని పిస్తుంది. సిరిసిల్ల ఒకనాటి కల్లోలిత ప్రాంతం. అందులో ఎల్లారెడ్డిపేట మండలం" దుమాల" గ్రామం గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ఆ కల్లోలం మధ్యలోంచే అతడు చూసిన ప్రపంచం వేరు. మనకు అతడు చూపించిన ప్రపంచం వేరు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్యాంపస్ లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎంతోమంది విద్యార్థులు ఎదిగొచ్చి సమాజానికి అనేక రంగాల్లో సేవలు అందిస్తున్నారు. అయితే ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా సేవలను అందించిన చకినాల శ్రీనివాస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

**సెలవులకే సెలవు..**
విధినిర్వహణలో తన సర్వీసులో సెలవులను కూడా వాడుకోకుండా విధులను నిర్వహించి విద్యార్థుల కోసం ఉపాధ్యాయుడు అంకిత భావంతో పనిచేస్తే ఎలాంటి ఫలితాలు ఉంటాయో ఆయన ప్రధానోపాధ్యాయునిగా విధి నిర్వహణ చూసి అర్థం చేసుకోవచ్చు. మూసివేతకు దగ్గరలో ఉన్న పాఠశాలను మూడువందలకు పైగా విద్యార్థులతో జీవం పోసి, కళకళలాడేలా చేసి జిల్లాలోనే అత్యుత్తమ విద్యార్థులను అందించే పాఠశాలగా రూపొందించడం వెనుక తన సహోపాధ్యా యుల సహకారంతో ఆయన చేసిన కృషిని ప్రత్యేకంగా గమనించవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది "పేద విద్యార్థులే" అనే విషయాన్ని గమనంలో ఉంచుకోవడంతో పాటు ప్రధానంగా సిరిసిల్ల లాంటి చేనేత కార్మిక కుటుంబాలు అత్యధికంగా నివసించే ప్రాంతంలోని పద్మనగర్, అంబికానగర్, బి,వై,నగర్, సుందరయ్యనగర్ లాంటి కార్మికవాడల నుంచి అనేకమంది విద్యార్థులను సర్కారుబడి వైపు రావడానికి చకినాల శ్రీనివాస్ తీసుకున్న ప్రత్యేకచొరవ ప్రస్తావించ వలసిందే.

విద్యార్థుల భవిష్యత్తు కోసం తపించే చకినాల శ్రీనివాస్ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడం కోసం ఎంతగానో తపించారు. కార్పొరేట్ ప్రపంచంలో ప్రత్యేకంగా నిలబడేలా విద్యార్థులను నడిపించారు. విద్యార్థుల కోసం పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కోసం కృషిచేశారు. ప్రత్యేకంగా చకినాల శ్రీనివాస్ చొరవతో ఏర్పాటైన గ్రంథాలయం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. విద్యార్థులకు అవసరమైన ఎన్నో విలువైన గ్రంథాలను స్వయంగా అందించారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు పోటాపోటీగానే ఈ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తున్నారు. ట్రిబుల్ ఐటీ లాంటి విద్యాసంస్థల్లో ప్రవేశా లను పొందడమే కాకుండా ఎన్నో అవకాశాలను అంది పుచ్చుకుంటున్నారు. భవిష్యత్ తరాలకు వారధిలా నిలబ డుతున్న ఆయనగురించి ఎంత చెప్పుకున్నా తక్కువే..

**పచ్చని కలలను సాకారం చేసే నీటి రంగ నిపుణుడు కూడా..**
సిరిసిల్ల నియోజకవర్గంలో అనేక దశాబ్దాల పాటు ఎత్తిపోతల ద్వారా వ్యవసాయానికి నీరు అందిస్తామనే నేతల హామీలను చూస్తూనే వస్తున్నాం. అయితే ఏనాడు ఎత్తింది లేదు,పోసింది లేదు. వ్యవసాయానికి సరిపోయే నీరు అందలేని స్థితిలో లేకపోవడంతో నియోజకవర్గం నుండి వలసలు అనివార్యం అయిన పరిస్థితులు. ఈ పరిస్థితులే శ్రీనివాస్ ను కదిలించాయి. విస్తృతంగా నీటివనరులపై అధ్యయనం చేసిన శ్రీనివాస్ తక్కువ ఖర్చుతో నియోజక వర్గం లోని అన్ని ప్రాంతాలకు నీరు అందేలా రూపొందించిన విధానం ఆనాడు మేధావి వర్గాలను సైతం ప్రభావితం చేసింది. తెలంగాణ ప్రాంతంలో నీటి వనరుల వినియోగంపై ఆయన పలు రచనలు చేశారు. "మానేరు జలసాధన వేదిక" ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్రజలకు అవగాహన కల్పించడం కోసం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆనాడు ప్రత్యేకంగా నిర్వహించిన అనేక సదస్సులు ఇంకా ప్రజల మదిలో పదిలంగా ఇప్పటికీ పలకరిస్తూనే ఉన్నాయి. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన ప్రవృత్తి రీత్యా ఆయన నీటి రంగ నిపుణుడైన మొత్తంగా ఆయన భవిష్యత్ తరాలను నడిపించే ఉపాధ్యాయుడే కాదు, సమాజం కోసం పరితపించిన నీటిరంగ నిపుణుడు కూడా.. ప్రస్తుతం ప్రధానోపాధ్యా యులుగా అంకితభావంతో పనిచేసిన ఆయన జులై 31, 2026 శుక్రవారం రోజున "పదవీ విరమణ" విద్యార్థుల మధ్య పండుగ వాతావరణం లో నిర్వహించారు. ఆయనను పలువురు అభినందించారు.



## జమ్మికుంటలో అంగరంగ వైభవంగా శ్రీ మడేలేశ్వరస్వామి బోనాల పండుగ

**జమ్మికుంట, జులై 31 (జనం సాక్షి):**
జమ్మికుంట పట్టణ పరిధిలో అంగరంగ వైభవంగా జరిగేటటువంటి శ్రీ మడేలేశ్వరస్వామి వారి బోనాల పండుగ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్). ఈ సందర్భంగా మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ శ్రీ మడేలేశ్వర స్వామి వారి ఆశీర్వాదంతో పట్టణ ప్రజలందరూ పాడి పంటలతో, ఆయురారోగ్యా లతో, అష్టైశ్వర్యాలతో, సుఖశాంతులతో ఉండాలనికోరుకుంటూ అలాగే స్వామి వారి దేవాలయంలో కొంత మరమ్మతులు మిగిలిఉన్నవి అని రజక సంఘం సోదరులు తెలపడం జరిగిందని, స్వామి వారి



కృపాకటాక్షంతో తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు వరంగంటి సదానందం,బూరుగుపల్లి రాము,తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ జూనియర్ అసిస్టెంట్ కు ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయ ఈవోగా పదోన్నతి



**ఎడపల్లి, జూలై 31 ( జనంసాక్షి ) :**
ఎడపల్లి మండలం జాన్కంపేట్ శ్రీ లక్ష్మీ నరసింహ దేవస్థానం జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహించిన రఘు ఆర్మూర్ పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంకు శుక్రవారం బదిలీ అయ్యారు. గత 23 సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ గా నిర్వహించిన కులకర్ణి రఘునాథ్ మూడవ శ్రేణి కార్య నిర్వాణ అధికారిగా శ్రీ జంబి హనుమాన్ దేవస్థానం ఆర్మూర్ కు వెళ్లిన సందర్భంగా జానకంపేట్ గ్రామానికి చెందిన చిలుక నరసయ్య, తడక నరసయ్య, ఉడుత పోతన్న, అర్చకులు ఘనంగా సన్మానించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: ఎంపీడీవో

**పెద్ద కొడప్గల్ జూలై 31 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండలంలోని చిన్న దేవిసింగ్ తండా, టీకారాం తండా, బూరుగుపల్లి గ్రామాలలో శుక్రవారం ఎంపీడీవో బీఆర్ అభినవ్ చందర్ పర్యటించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల ప్రస్తుత నివాసాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుల ప్రస్తుత నివాసాల స్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మారుతి రావు, రాజేందర్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## పే స్కేల్ అమలు కోసం ఉపాధి హామీ ఉద్యోగుల నిరసన

### పెన్‌డౌన్, షట్‌డౌన్, సహాయ నిరాకరణ కార్యక్రమాలు

**రామగిరి జనం సాక్షి జూలై 31:**
పే స్కేల్ అమలు, పెండింగ్ జీతాల విడుదల తదితర డిమాండ్ల సాధన కోసం టీజీఆర్డీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రామగిరి మండలంలోని విబిజి రాంజీ (ఉపాధి హామీ) ఉద్యోగులు శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.నిరసన కార్యక్రమంలో పాల్గొన్న టీజీఆర్డీ జేఏసీ రాష్ట్ర ట్రెజరర్ కె. సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు జూలై 31న పెన్‌డౌన్, షట్‌డౌన్, సహాయ నిరాకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2024 ఫిబ్రవరి 2న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించిన పే స్కేల్‌ను వెంటనే అమలు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని, ఉద్యోగుల ప్రమోషన్లు, బదిలీలు, గ్రాట్యుటీ, వివిధ అలవెన్సులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో టీజీఆర్డీ జేఏసీ రాష్ట్ర ట్రెజరర్ కె. సత్యనారాయణతో పాటు ఇంజనీరింగ్ కన్సల్టెంట్ వి. మౌనిక, టెక్నికల్ అసిస్టెంట్లు మల్క అఖిల, నేరెళ్ల సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



### బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవనంపై

# నిషేధాజ్ఞలు కొనసాగింపు..

- అనుమతి లేని డ్రోన్లు, డీజే సౌండ్ సిస్టమ్‌లపై కఠిన చర్యలు..
- రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం అమలు..
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధులు,రహదారులపై అసభ్య పదజాలంతో ప్రవర్తించడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని,ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01-08-2026 నుండి 01-09-2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి వీటి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం,1348 ఫసలీ నిబంధనల ప్రకారం ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీజే సౌండ్ సిస్టమ్‌లు, డ్రోన్లపై నిషేధాజ్ఞలు పొడిగింపు:
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల,పెద్దపల్లి జోన్‌లలో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కూడా పొడిగించినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లలు,వృద్ధులు,రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి అంతరాయం కలగకుండా,శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు అధిక శబ్దంతో కూడిన డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై నిషేధం విధించినట్లు తెలిపారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజలను సమీకరించేందుకు డీజే సౌండ్ సిస్టమ్‌లను వినియోగిస్తున్నట్లు గమనించామని పేర్కొన్నారు. అయితే, కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. మైక్ సెట్ వినియోగానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు కూడా 01-08-2026 నుండి 01-09-2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి కాలపరిమితిని పొడిగించే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం అమలు:
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో రామగుండం కమిషనరేట్ చట్టం-2016లోని సెక్షన్ 7(1), సెక్షన్ 22(1)(ఏ) నుండి (ఎఫ్), సెక్షన్ 22(2)(ఏ), (బీ),సెక్షన్ 22(3), హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం,



1348 ఫసలీలోని సెక్షన్ 30, పోలీస్ చట్టం--1861 నిబంధనల మేరకు 01-08-2026 ఉదయం 6.00 గంటల నుండి 01-09-2026 ఉదయం 6.00 గంటల వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కాలంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాల నుకుంటే ముందుగా సంబంధిత పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే, బంద్‌ల పేరిట సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, ఇతరులను ఒత్తిడి చేయడం లేదా బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా విజ్ఞప్తి చేశారు.



## జీడీకే-11 ఇంక్లయిన్‌లో పి.మల్లికార్జున్ పదవీ విరమణ వేడుకలు..

**- ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్..**

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి ఆర్‌జీ-1 పరిధి జీడీకే-11 ఇంక్లయిన్ గనిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సింగరేణి ఉద్యోగి పి.మల్లికార్జున్ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఘనంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ పొందిన మల్లికార్జున్‌ను, ఆయన సతీమణిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి సంస్థలో మల్లికార్జున్ ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కూడా ఆయన విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చూపిన నిబద్ధత ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి మాత్రమే పరిమితమని, ప్రజాసేవకు మాత్రం విరామం ఉండదని ఎమ్మెల్యే అన్నారు. ఇకపై కూడా సామాజిక, రాజకీయ, ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని మల్లికార్జున్‌కు సూచించారు. వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.
అంతకుముందు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ జీడీకే-11 గనిపై కొలువై ఉన్న మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గని కార్మికులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సింగరేణి కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మల్లికార్జున్ కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# సేవా పర్వంలో సుదీర్ఘ పాత్ర అభినందనీయం

## ఘనంగా ఉద్యోగ విరమణ

**శంకరపట్నం, జూలై 31 (జనం సాక్షి)**
ఆర్టీసీలో ఉద్యోగ సేవ పర్వంలో సుదీర్ఘ పాత్ర అభినందనీయం, బస్ కండక్టర్ గా ఉద్యోగం చేపట్టి ఆపై పదవి ఉన్నతిలో భాగంగా కంట్రోలర్ గా, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ గా సేవలందించిన శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నం గ్రామానికి చెందిన బొంగోని తిరుపతి గౌడ్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కరీంనగర్ 2 డిపోలోఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో సంస్థ ఎండి వై నాగిరెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ గడిచిన కాలం జ్ఞాపకాలుగా, ఎదురొచ్చే కాలాన్ని సంపదగా, కొనసాగుతున్న పయనాన్ని వరంగా భావించడమే జీవితమని పంపిన అభినందన పత్రాన్ని డిపో మేనేజర్ చేతుల మీదుగా అందజేసి తిరుపతికి పూలమాల వేసి, తిరుపతి దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో తిరుపతి శ్రేయోభిలాషులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ బుర్ర సంపత్ కుమార్ గౌడ్, టియుడబ్ల్యూ జే (ఐజెఏయు) మండల ఉపాధ్యక్షులు బుర్ర సత్యనారాయణ గౌడ్, గొట్టే అర్జున్, గ్రామ సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ ఆకుబత్తిని విజయకుమార్, మాజీ సర్పంచ్ దొంగల రాములు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.




# విశిష్ట సేవలకు ఘన సత్కారం..

**- ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారికి ఆత్మీయ వీడ్కోలు..**

గోదావరిఖని, జనంసాక్షి :
రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) సంజీవయ్యను శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ అనేది సహజమైన ఘట్టమని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించిన సంజీవయ్య సేవలు ప్రశంసనీయమైనవని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా మీకు ఎలాంటి అవసరం వచ్చినా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మీరు,మీ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని,మీ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదిగి జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె.శ్రీనివాస్,ఏఓ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ రమేష్, ఆర్ఐ రమేష్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం,సీసీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

